
అనకాపల్లి గవరపాలెం అరుంధతినగర్‌లో నూకాంబిక అమ్మవారిని బుధవారం జొన్న పొత్తులతో అలంకరించారు.

గాంధీ, శాస్త్రీజీ జీవనశైలి అందరికీ ఆదర్శం

అనకాపల్లి/గ్రామీణం, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిల పాత్ర చిరస్మరణీయమని కలెక్టరు విజయకృష్ణన్ అన్నారు. బుధవారం స్థానిక బెల్లం మార్కెట్‌లోని గాంధీ విగ్రహానికి, శాస్త్రి చిత్రపటానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో కలిసి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారిరువురూ నిరాడంబరంగా జీవించి ఆదర్శంగా నిలిచారని గుర్తుచేశారు. జేసీ జాహ్నవి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, జిల్లా భాజపా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పాల్గొన్నారు.


శంకరం పైవంతెనను శుభ్రం చేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

పరిశుభ్రత దిశగా అడుగేయాలి

పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పిలుపునిచ్చారు. శంకరం పైవంతెనపై స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. వంతెనపై రహదారిని శుభ్రం చేసి చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు తొలగించారు. యువత గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో పరిసరాల పరిశుభ్రత పనులు చేపట్టారు. జేసీ జాహ్నవి, జిల్లా అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఇక్కడా అక్కడా ఆయనే!

సహకారానికి 'సారథ్యం' కరవు..!


కొక్కిరాపల్లి పీఏసీఎస్‌లో కంప్యూటరీకరణ చేస్తున్న సిబ్బంది

మూడు, నాలుగు పీఏసీఎస్‌లకు ఒకే పర్సన్ ఇంఛార్జి

వారితో పనిపడితే దస్త్రాలు పట్టుకుని తిరగాల్సిందే..

ఈనాడు, అనకాపల్లి, న్యూస్‌టుడే, కె.కోటపాడు, ఎలమంచిలి:

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్)కు సారథులు లేకుండా పోయారు. పాలనా వ్యవహారాలన్నింటినీ పర్సన్ ఇన్‌ఛార్జులతోనే నెట్టుకొస్తున్నారు. మూడు, నాలుగు సంఘాలకు ఒకరే ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. వీరి కొరత కారణంగా పీఏసీఎస్‌ల్లో లావాదేవీలపై ప్రభావం పడుతోంది. వ్యవసాయ రుణాల మంజూరులో, సహకార దస్త్రాల కంప్యూటరీకరణకు ఇబ్బందులు పడాల్సివస్తోంది. వైకాపా హయాంలో ఈ సంఘాలకు ఎన్నికలు జరపకుండా త్రీమెన్ కమిటీలతో సరిపెట్టేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పర్సన్ ఇన్‌ఛార్జిలను వేశారు. ఇటీవల సాగునీటి, చేనేత సంఘాల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. వాటితో పాటు సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 98 పీఏసీఎస్‌లు ఉన్నాయి. వాటి పరిధిలో 3.89 లక్షల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ప్రస్తుతం వ్యవసాయ రుణాలు అందించడం.. గతంలో పీఏసీఎస్‌ల ద్వారా జరిగిన లావాదేవీలన్నింటిని ఆన్‌లైన్ చేసే కార్యక్రమాలు జరుగుతున్నాయి. వీటికి తప్పనిసరిగా పర్సన్ ఇన్‌ఛార్జి సంతకాలు అవసరం అవుతుంటాయి. మరికొన్ని సంఘాల్లో ఎరువులు, ఇతరత్రా వ్యాపారాలకు అవసరమైన నగదు లావాదేవీలకు వీరు అందుబాటులో ఉండాలి. అయితే ఒక్కో ఇంఛార్జికి మూడు, నాలుగు సంఘాల బాధ్యతను అప్పగించడంతో వారంలో ఒక్కసారి మించి పీఏసీఎస్‌కు రాలేకపోతున్నారు.

> ఇదేంటని అడిగితే 'మీకు తెలియదా?, అక్కడా నేనే.. ఇక్కడా నేనే చూసుకోవాలి.. మీరే అర్థం చేసుకుని నా సంతకాలు అవసరం అనుకుంటే నేనున్నచోటకే దస్త్రాలు, చెక్‌లు తెచ్చివ్వండి.. చూసి పెడతా' అని పీఏసీఎస్ సీఈవోలకు చెబుతున్నారు. ఇలా తిరగడం వల్ల రుణాల మంజూరు ప్రక్రియలోనే కాదు.. దస్త్రాల కంప్యూటరీకరణలోను జాప్యం జరుగుతోందని సంబంధిత సిబ్బందే చెబుతున్నారు.

సహకార సంఘాలకు 2013లో ఎన్నికలు జరగ్గా వాటి కాలపరిమితి 2018తో ముగిసింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించింది కానీ సహకార సంఘాలను పట్టించుకోలేదు. తమ పార్టీకి చెందిన నేతలను పీఏసీఎస్‌లకు త్రీమెన్ కమిటీగా, జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు (డీసీసీబీ) ఏడుగురితో కూడిన కమిటీ నియమించి బాధ్యతలను అప్పగించింది. కొంతమంది నేతలు బినామీలతో సహకార సంఘాల సొమ్ములను స్వాహా చేశారు. కూటమి సర్కారు కొలువు తీరాక ఈ కమిటీలు పోయి పర్సన్ ఇన్‌ఛార్జులు వచ్చారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాలోని 85 సంఘాలను 35 మంది చేతిలో పెట్టారు. ఉదాహరణకు నక్కపల్లి మండలంలో మూడు సంఘాలకు ఒక్కరే ఇన్‌ఛార్జి. అలాగే పాయకరావుపేటలో నామవరం, శ్రీరాంపురం సంఘాలకు ఒక అధికారే ఇన్‌ఛార్జిగా ఉన్నారు. ఎలమంచిలి, చోడవరం, పాడేరు నియోజకవర్గాల్లోను ఇదే తీరు. సంఘాలు ఎక్కువ ఇన్‌ఛార్జులు తక్కువ కావడంతో వారు పనిచేసే సహకార శాఖకు, ఇంఛార్జిగా ఉన్న సంఘాలకు న్యాయం చేయలేకపోతున్నారు. సహకార సంఘాలకు పూర్వవైభవం రావాలంటే ఎన్నికల నిర్వహణ ఒక్కటే మార్గమని అధికారులు చెబుతున్నారు.


రుణాల్లో జాప్యం..: సహకార సంఘాల్లో పాలకవర్గాలు లేక సకాలంలో రుణాలు అందటం లేదు. వ్యవసాయ పెట్టుబడులకు ఇబ్బందులు పడుతున్నాం. బయట అప్పులు చేయాల్సి వస్తోంది. అదే పాలక వర్గాలుంటే సమయానికి నిర్ణయాలు తీసుకునే రుణాలు అందేలా చేసేవారు.
–దొగ్గ దేముడు, ఎ.కోడూరు

సంఘాలను బట్టి సర్దుబాటు..: అన్ని పీఏసీఎస్‌లు ఒకేలా లేవు.. కొన్నింటిలో చాలా తక్కువ లావాదేవీలు జరుగుతున్నాయి. అలాంటి వాటిని రెండు మూడు సంఘాలకు ఒక పర్సన్ ఇంఛార్జిగా వేశాం. పెద్ద సంఘాలన్నింటికీ ఒక్కొక్కరికే బాధ్యతలు ఇచ్చాం. రుణాల మంజూరులో జాప్యం జరిగినట్లు మాదృష్టికి రాలేదు. కంప్యూటరీకరణకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.
–కిరణ్‌కుమారి, సహకార శాఖ డివిజనల్ అధికారిణి


ఎన్నికలు నిర్వహించాలి..: పీఏసీఎస్‌లకు ఎన్నికలు జరిపితేనే రైతులకు అన్నిరకాల సేవలు సకాలంలో అందుతాయి. 2013 జనవరిలో తర్వాత ఇంతవరకు ఎన్నికలు జరగలేదు. కూటమి ప్రభుత్వమైన ఈసారి ఎన్నికలు నిర్వహించి సహకార సంఘాలను బలోపేతం చేయాలి.
–కొల్లి శివప్రసాదు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, రొంగలినాయుడుపాలెం

మెగా రక్తదాన శిబిరానికి స్పందన


వడ్డాదిలో రక్తదానం చేస్తున్న యువకులు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: అమ్మ హెల్పింగ్ హార్ట్స్, వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో బుధవారం వడ్డాదిలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు ఎనిమిది వందల యూనిట్ల రక్తం సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. అనకాపల్లి ఎంపీ సీఎం.రమేశ్, ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, జిల్లా తెదేపా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జనసేన ఇన్‌ఛార్జి పీవీఎస్ఎన్ రాజు తదితరులు శిబిరాన్ని సందర్శించి దాతలు, నిర్వాహకులను అభినందించారు. ఎంపీ మాట్లాడుతూ.. ఇటువంటి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థ సభ్యులకు ఎప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. రక్తదానంతో ఎన్నో ప్రాణాలు నిలపొచ్చన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, బాడీ బిల్డింగ్ ప్రదర్శనలు ఏర్పాటు చేసి రక్తదానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, సర్పంచి కోరుకొండ కామలక్ష్మి, వైస్ ఎంపీపీ దొండా లలిత, రక్తదాన చైతన్యకర్త వినోద్‌బాబు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ రమేశ్, చిత్రంలో ఎమ్మెల్యే రాజు, తాతయ్యబాబు తదితరులు

క్రీడాలోకం

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు చోద్యం విద్యార్థిని

గొలుగొండ, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు చోద్యం ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.మౌనిక ఎంపికైంది.


పీఈటీ నూకరాజుతో మౌనిక

ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో ఈ బాలిక ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు కె.నూకరాజు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, పాఠశా కమిటీ ఛైర్మన్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఈ సందర్భంగా మౌనికను అభినందించారు.

అంతర్రాష్ట్ర క్రీడాపోటీలు ప్రారంభం


క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న విజయ్‌ప్రకాష్

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో అంతర్రాష్ట్ర క్రీడా పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సీబీఎస్ఈ క్లస్టర్-7 (ఆంధ్రా, తెలంగాణ) కబడ్డీ, వాలీబాల్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలను శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ ప్రారంభించారు. రెండు రాష్ట్రాల నుంచి వచ్చిన జట్టు సభ్యులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. క్రీడాస్ఫూర్తి ఉన్న వారంతా విజేతలేనని పేర్కొన్నారు. అనంతరం కబడ్డీ, వాలీబాల్ అండర్-14, 17, 19 విభాగాల్లో 1200 మంది క్రీడాకారిణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొ కబడ్డీ అఫీషియల్ పి.వి.ఎస్.వి.ప్రసాద్, బి.మురళీకుమార్, జాతీయ వాలీబాల్ రిఫరీ బి.శ్రీనివాసరావు, మోహన్‌బాబు, ఎల్.వెంకటరమణ, కె.హేమంత్‌కుమార్‌రావు తదితరులు పాల్గొన్నారు.


కబడ్డీ ఆడుతూ...

నాతవరం బాలిక సత్తా



నాతవరం, న్యూస్‌టుడే: స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు నాతవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థిని కోసూరు దుర్గాభవాని ఎంపికైంది. ఎస్.రాయవరం మండలం పెదగుమ్ములూరులో జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లా పరిధి అండర్-17 పోటీల్లో ఈ చక్కటి ఆటతీరు కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు ప్రధానోపాధ్యాయుడు రవిశంకర్ తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.కోటేశ్వరరావు బాలికకు అభినందనలు తెలిపారు.

విదేశీగడ్డపై తల్లీ కూతుళ్లకు బంగారు పతకాలు!

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే:

విదేశీ గడ్డపై జరిగిన క్రీడా పోటీల్లో పాల్గొన్న తల్లీ, కూతుళ్లు ఏకంగా ఆరు బంగారు పతకాలు సాధించి రికార్డు సృష్టించారు.


సాధించిన పతకాలు, కప్పులతో తల్లి నాగజ్యోతి, కుమార్తె సాహితి

సింగపూర్, మలేషియాల్లో గత నెల 22 నుంచి 30 మధ్య సంయుక్త భారతీయ కేర్ ఫౌండేషన్ నిర్వహించిన అంతర్జాతీయ క్రీడా పోటీల్లో రోలుగుంట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న కలగట్ల నాగజ్యోతి, ఆమె కుమార్తె సాహితి పాల్గొన్నారు. నాగజ్యోతి పవర్ లిఫ్టింగ్, డిస్కస్, జావలిన్‌త్రోలో ప్రథమస్థానం సాధించి బంగారు పతకాలు, వంద మీటర్ల పరుగులో రజత పతకం సాధించారు. విశాఖపట్నం విజ్ఞాన్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న ఆమె కుమార్తె సాహితి ఈత 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్, 59 మీటర్ల ఫ్రీ స్టయిల్ విభాగాల్లో మూడు బంగారు పతకాలు సాధించారు. తల్లీకూతుళ్లిద్దరూ గతంలోనూ అనేక రాష్ట్ర, జాతీయ పోటీల్లో పతకాలు సాధించారు. నర్సీపట్నం వాసవీ కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం వీరిని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.జి.నాథ్, ఆయుష్మాన్ వాసవీ క్లబ్ జిల్లా ఉప కార్యదర్శి వెలగా నారాయణరావు సత్కరించారు. బంగారు పతకాలు సాధించి దేశానికి పేరు తీసుకురావడం హర్షణీయమని వీరు పేర్కొన్నారు. నాగజ్యోతికి విద్యాశాఖ పరంగానూ ప్రోత్సాహం అందించాలని కోరారు.

తైక్వాండోలో ఎలమంచిలి క్రీడాకారుల ప్రతిభ


మోహిత్ సుస్మిత

ఎలమంచిలి, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎలమంచిలికి చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారని కోచ్ నగిరెడ్డి సత్యనారాయణ చెప్పారు. అండర్- 17 స్కూల్ గేమ్స్ విభాగంలో నగిరెడ్డి మోహిత్, పోలవరపు సుస్మిత బంగారు పతకాలు సాధించి ఎలమంచిలికి పేరుతెచ్చారన్నారు. ఈనెల 6 నుంచి 8 వరకూ తిరుపతిలో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు.

గెడ్డలో అడ్డగోలు తవ్వకాలు



అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అక్రమ సంపాదనకు అలవాటుపడిన వ్యాపారులు ప్రభుత్వ భూములను వదలడం లేదు. పట్టపగలే గ్రావెల్ తవ్వకాలకు తెగబడుతున్నారు. మండలకేంద్రానికి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నా అధికారులు, పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొండకర్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 99లో బుధవారం పొక్లెయిన్‌తో గెడ్డలో తవ్వకాలు సాగించారు. నాలుగు ట్రాక్టర్లలో ఇక్కడి నుంచి గ్రావెల్‌ను తరలించుకుపోయారు. కొండగెడ్డలు ప్రవహించే ప్రదేశాల్లో తవ్వకాలు చేపట్టడంపై గ్రామస్థులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇలా అడ్డగోలుగా గెడ్డల్లో తవ్వేసి వాటిని మరింత లోతుగా మార్చడం వల్ల తమతో పాటు పశువులకు ప్రమాదం పొంచివుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలు చేపట్టడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మహాత్ముని మరిచారా..!



నర్సీపట్నం కొత్తవీధి-పెదబొడ్డేపల్లి మార్గంలో పెద్దచెరువు ఒడ్డున ఈ ఏడాది ఫిబ్రవరిలో అప్పటి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ప్రారంభించిన గాంధీ విగ్రహం ఇది. మహాత్ముని జయంతి నాడైనా విగ్రహానికి ఏ ఒక్కరూ దండ వేయలేదు. ప్రారంభోత్సవం నాటి అట్టహాసం చూసిన వారంతా, నేటి పరిస్థితి చూసి ఆవేదన చెందారు. –నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే

ఎలమంచిలిలో ఉద్యోగ మేళా నేడు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా ఎలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 3న ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. మూడు కంపెనీలతో నిర్వహిస్తున్న ఈ ఇంటర్వ్యూలకు పదో తరగతి నుంచి పీజీ వరకు చదువుకొని 18 నుంచి 30 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న యువతీ, యువకులు పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరాలను skillunivers.apssdc.in వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థులు బయోడేటా, విద్యార్హత పత్రాలతో హాజరుకాలన్నారు. వివరాలకు 81425 65416 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రోడ్డు విస్తరణపై రేకెత్తిన ఆశలు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పాయకరావుపేట ప్రధాన రహదారి నరకానికి నకలుగా తయారైంది. రోజురోజుకు పెరిగి పోతున్న ఆక్రమణలతో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు వాహనచోదకులు, పాదచారుల సహనానికి పరీక్ష పెడుతోంది.

నక్కపల్లి, ఎస్‌.రాయవరం, కోటవురట్ల, పాయకరావుపేట మండలాల్లోని అన్ని గ్రామాల ప్రజలు ఏ చిన్న అవసరమైనా తుని, పాయకరావుపేటకే రావాలి. ఆటోలు, బస్సులు, ద్విచక్రవాహన చోదకులతో జంట పట్టణాలు కిక్కిరిసిపోతుంటాయి. పట్టణ జనాభా సుమారు 40 వేలకు చేరింది. ఫార్మా, హెటిరో పరిశ్రమల ఉద్యోగుల రాకతో పట్టణంలో పూర్తిగా మార్పు వచ్చింది. కార్పొరేట్‌ బ్యాంకులు, వస్త్రదుకాణాల మాల్స్‌ అందుబాటులోకి వస్తున్నాయి. పట్టణీకరణ దిశగా వడివడిగా అడుగులు పడుతున్నా పాయకరావుపేట ప్రధాన రహదారి మాత్రం రోజురోజుకు దారుణంగా తయారవుతోంది. పట్టణంలోని గౌతమ్‌ థియేటర్‌ కూడలి నుంచి జాతీయ రహదారి పై కూడలి వరకు 14 మీటర్ల వెడల్పున రోడ్డు ఉంది. రహదారులు, భవనాల శాఖ పరిధిలోని ఈ రోడ్డును రెండు వరుసలుగా విస్తరించేందుకు దీన్ని వీఎంఆర్‌డీఏకు బదలాయించారు. ఆ తర్వాత రూ.6 కోట్ల నిధులు మంజూరు చేశారు. పనులు మొదలైన తర్వాత అప్పట్లో రోడ్డు మార్జిన్‌ వర్తకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పనులు అర్ధంతరంగా నిలిచాయి. ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం ఆక్రమణలు తొలగించకుండా 14 మీటర్ల వెడల్పుతో నిర్మించాల్సిన రోడ్డును కేవలం 7 మీటర్లకే సరిపెట్టింది. దీనికోసం రూ.2 కోట్లు వ్యయం చేశారు.


పాయకరావుపేట ప్రధాన రహదారి

ఆక్రమణల విజృంభణ

తక్కువ వెడల్పుతో రోడ్డు వేసి మిగతా స్థలాన్ని వదిలేశారు. ఇదే అదనుగా భావించి రోడ్డును ఆనుకుని ఉన్న వారంతా ఆక్రమణలకు తెరలేపారు. రహదారికి రెండు వైపులా రోడ్డును సిమెంట్‌తో చదును చేసి వ్యాపార నిర్వహణ చేపట్టారు. దీంతో ఇరుకైన రోడ్డుపై తరచూ ట్రాఫిక్‌ నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో ఒక్కోసారి గంటల తరబడి ఇక్కట్లు తప్పడం లేదు.

* ఇటీవల నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ప్రధాన రహదారిని రెండు వరుసలుగా విస్తరించనున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత ప్రకటించారు. దీంతో పట్టణవాసులు సహా నియోజకవర్గంలో మరోసారి కొంగొత్త ఆశలు తెరలేచాయి. ట్రాఫిక్‌ కష్టాలు తీరతాయనే ఆశాభావం వ్యక్తమైంది. అయితే రోడ్డు మార్జిన్‌ వర్తకుల సమస్య ఇంకా పరిష్కారం కాలేదు. కూటమి నాయకులు, హోంమంత్రి అనిత దీనిపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తే పేట వాసుల కల నెరవేరనుంది.


ఆక్రమణలతో వెడల్పు తగ్గిన రోడ్డు

అందరితో చర్చించి...



పాయకరావుపేట రహదారిని తప్పనిసరిగా విస్తరిస్తాం. ట్రాఫిక్‌ ఇబ్బందులు తొలగాలంటే రెండు వరుసల దారి వేయాల్సిందే. విస్తరణకు ఉన్న అడ్డంకులను తొలగించేందుకు కృషి చేస్తాం. అందరి ఆమోదంతో రహదారికి కొత్తరూపు తీసుకువస్తాం.

– వంగలపూడి అనిత, హోం మంత్రి

మడుగు.. చూసి వెయ్‌ అడుగు

నర్సీపట్నం 14వ వార్డు పరిధిలోని సుబ్బారాయుడుపాలెంలో గత ప్రభుత్వం నిర్మించిన పక్కా ఇళ్ల కాలనీకి వెళ్లే రహదారి ఇది. తారు రోడ్డు నుంచి చెరువు గట్టు మీదుగా కాలనీకి గతంలో నిర్మించిన మట్టిరోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోయాయి. పొర్లుకట్టు సమీపంలో రోడ్డంతా గోతులు, బురదమయంగా మారింది. పాదచారులు, వాహన చోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 56 ఇళ్లున్న ఈ కాలనీలో 15 ఇళ్లలో గృహప్రవేశాలు చేశారు. కానీ రహదారి సదుపాయం సరిగా లేక కాపురాలు ఉండటం లేదు. ఈ రహదారిని కంకర రోడ్డుగా మార్చి కల్వర్టు నిర్మించేందుకు రూ. 25 లక్షలు అవసరమని గతంలో మున్సిపల్‌ అధికారులు అంచనా వేశారు. సమస్యను కమిషనర్‌ జంపా సురేంద్ర దృష్టికి తీసుకువెళ్లగా ప్రభుత్వం నుంచి నిధులొస్తే పనులు చేపడతామని తెలిపారు.

– నర్సీపట్నం అర్బన్‌, న్యూస్‌టుడే


సుబ్బారాయుడుపాలెం కాలనీకి వెళ్లే మార్గంలో ఇదీ దుర్గతి

పొదుపు మహిళల ఉత్పత్తులకు విస్తృత ప్రాచుర్యం

నర్సీపట్నం, న్యూస్‌టుడే: పొదుపు సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు విస్తృత ప్రాచుర్యం కల్పించడానికి వీలుగా మెప్మా అధికారులు చర్యలు చేపట్టారు. పెదబొడ్డేపల్లిలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) కార్యాలయంలో బుధవారం విశాఖ జీవీఎంసీకి చెందిన నోడల్‌ అధికారి బాలశేఖర్‌ స్వయం సహాయక సంఘాల మహిళలు రూపొందించిన వివిధ రకాల బొమ్మలు, చేతి సంచులు, గిల్ట్‌ నగలు, దుస్తులు తదితర 50 రకాల ఉత్పత్తులను వివిధ కోణాల్లో ఫొటోలు తీశారు. వీటికి దిల్లీ నుంచి ఆమోదం లభించిన తరువాత ఓఎన్‌డీసీ యాప్‌ ద్వారా ఆన్‌లైన్‌లో ఎవరైనా బుక్‌ చేసుకోవడానికి వీలుగా ఏర్పాట్లు చేస్తారని బాలశేఖర్‌ తెలిపారు.


ఫొటోలు తీస్తున్న జీవీఎంసీ నోడల్‌ అధికారి బాలశేఖర్‌

ఈదురుగాలులతో కుండపోత వర్షం

ఎలమంచిలిలో కూలిన విద్యుత్తు స్తంభాలు, చెట్లు


రాంనగర్‌లో రోడ్డుకు అడ్డంగా కూలిన స్తంభాలు


ఎలమంచిలి యానాద్రి కాలనీలో విరిగిన స్తంభాలు, నేలకూలిన చెట్లు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలిలో బుధవారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పిడుగులు హడలెత్తించాయి. గాలుల బీభత్సానికి 12 స్తంభాలు విరిగిపోయాయి. 20కిపైగా చెట్లు రోడ్లపై కూలిపోయాయి. చెట్లు పడి పలు చోట్ల తీగలు తెగిపోయాయి. మధ్యాహ్నం 3 గంటలకు ఒక్కసారిగా ఈదురుగాలులతో కుండపోతగా కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాంనగర్, యానాది కాలనీ, మిలట్రీ కాలనీ ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. పలుచోట్ల చెట్లు కార్లు, బైక్‌లపై పడటంతో దెబ్బతిన్నాయి. మధ్యాహ్నం నుంచి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. పిడుగులు పడటం వల్ల పలు చోట్ల విద్యుత్తు మీటర్లు, చాలా ఇళ్లలో గృహోపకరణాలు కాలిపోయాయి. గంట వ్యవధిలో మూడు సెంటీమీటర్ల వర్షం కురిసింది. పట్టణం అంధకారంలో చిక్కుకుంది. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అధికారులతో ఫోన్‌లో సమీక్షించి యుద్ధప్రాతిపదికన కూలిన చెట్లు తొలగించాలని ఆదేశించారు. విరిగిన స్తంభాలు మార్చాలన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాదేవి ఈ ప్రాంతాల్లో పర్యటించారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు యంత్రాల సాయంతో నేలకూలిన చెట్లను తొలగించే పనులు చేయించారు. విద్యుత్తు ఏఈ కనకరాజు ఆచంట ఆదినారాయణ విరిగిన స్తంభాలు తొలగించి కొత్తవి వేస్తున్నారు. గ్రీన్ సిటీ వద్ద 33 కేవీ విద్యుత్తు లైన్‌పై చెట్లు పడటంతో పలుచోట్ల తీగలు తెగిపోయాయి. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు సిబ్బందితో పనులు చేయిస్తున్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు కట్టర్ల సాయంతో కూలిన చెట్లు తొలగిస్తున్నారు.

చేనేత కార్మికులకు అండగా ఉంటాం: ఎంపీ రమేశ్


ఎంపీ రమేశ్‌ను సత్కరిస్తున్న శ్రీనివాస్

విశాఖపట్నం, న్యూస్‌టుడే: చేనేత కార్మికులకు అండగా ఉండాలని అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సి.ఎం.రమేశ్ కోరారు. ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజు నేపథ్యంలో సేవా పక్షోత్సవాల్లో భాగంగా గాంధీ జయంతి పురస్కరించుకొని విశాఖ నగరంలోని లాసన్స్‌బేకాలనీ భాజపా కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఖాదీ సంతను సీఎం రమేష్ ప్రారంభించారు. ముందుగా మహాత్మాగాంధీ విగ్రహానికి ఎంపీ రమేష్‌తో పాటు కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చేనేత ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎంపీ సి.ఎం.రమేష్, మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర సందర్శించారు. చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చోడవరం, న్యూస్‌టుడే: విశాఖ విమానాశ్రయంలో ఎంపీ రమేశ్‌కు చోడవరం మండలం గవరవరం గ్రామానికి చెందిన నక్కా శ్రీనివాస్ గజమాలతో స్వాగతం పలికారు. ఎంపీ నాయకత్వంలో చోడవరం నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని శ్రీనివాస్ పేర్కొన్నారు.

ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఎలమంచిలిలో హాల్ట్ ఇవ్వాలి


ఎంపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఎలమంచిలి, అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఎలమంచిలిలో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ ఇచ్చేలా కృషి చేయాలని ఎంపీ సీఎం రమేశ్‌కు ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ విన్నవించారు. రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా నియమితులై తొలిసారిగా విశాఖ వచ్చిన ఎంపీని బుధవారం ఎమ్మెల్యే కలిసి ఘనంగా సన్మానించారు. తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు సైతం ఆయనను కలిసి ఎలమంచిలి రైల్వేస్టేషన్ విస్తరణతోపాటు ముఖ్యమైన రైళ్లు ఆపడానికి కృషిచేయాలని కోరారు. రైల్వేస్టేషన్‌లో సౌకర్యాల కల్పనపైనా శ్రద్ధ తీసుకోవాలన్నారు.

చౌడువాడలో పిచ్చికుక్క స్వైరవిహారం

పది మందికి గాయాలు

కె.కోటపాడు, న్యూస్‌టుడే: కె.కోటపాడు మండలం చౌడువాడలో బుధవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసి పదిమందిని గాయపరిచింది. ఈ దాడిలో కొమార త్రిషిక (5), గొలగాని సౌజన్య (4), దుక్క సిద్దు (6)తో పాటు పెద్దలు గాడి వెంకటరమణ, ఉరికిటి మాత, కుంచా రమణకు గాయాలయ్యాయి. వీరంతా చౌడువాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స పొందారు. తీవ్ర గాయాలైన ఉరికిటి మాతను కె.కోటపాడు సామాజిక ఆసుపత్రికి తరలించారు. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరు స్థానికంగా ఉన్న ఆసుపత్రుల్లో చికిత్స పొందారు.

అడవి పంది అడ్డం పడి రైతుకు..

కె.కోటపాడు, న్యూస్‌టుడే: అడవి పంది బైక్‌కు అడ్డంపడి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం ఉదయం పొలం నుంచి పాలను రైతు కొరుబిల్లి శ్రీనివాసరావు బైక్‌పై తెస్తున్నారు. ఈ సమయంలో పంది అడ్డం పడడంతో వాహనం బోల్తా పడి ఇతను గాయపడ్డారు.

వన్యప్రాణాల రక్షణ అందరి బాధ్యత

ఎలమంచిలి, న్యూస్‌టుడే: వన్యప్రాణులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అటవీశాఖ అధికారి బి.వి.రమణ అన్నారు. వన్యప్రాణుల వారోత్సవం పురస్కరించుకుని చినగొల్లలపాలెం, పెదగొల్లలపాలెం గ్రామాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణుల వల్లే పర్యావరణ పరిరక్షణతో పాటు వాతావరణ సమతుల్యత సాధ్యమన్నారు. గ్రామాల్లోకి వన్యప్రాణులు వస్తే తమకు సమాచారం అందించాలన్నారు. వీటిని వేటాడడం నేరం అన్నారు. ఎవరైనా అలా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే చాలా రకాల వన్యప్రాణులు అంతరించిపోయాయన్నారు.


చినగొల్లలపాలెంలో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు

ఈత కొలనులో మునిగి ఒకరి మృతి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: కొండకర్ల ఈతకొలనులో ప్రమాదవశాత్తు మునిగి విశాఖలోని గోపాలపట్నం ఆదర్శనగర్‌కు చెందిన పెదపాటి రాజు (39) మృతి చెందారు. అచ్యుతాపురం సీఐ నమ్మి గణేష్ కథనం ప్రకారం.. అచ్యుతాపురం సెజ్‌లోని అభిజీత్ కంపెనీలో పనిచేసే కొందరు ఉద్యోగులతో కలిసి బుధవారం రాత్రి కొండకర్లలోని ఒక రిసార్ట్స్‌కు వచ్చారు. స్నేహితులు ఈతకొలను ఒడ్డున ఉండగా రాజు కొలనులో దిగాడు. కొద్ది సమయం ఈతకొట్టి నీటిలో మునిగిపోయాడు. సరదాగా ఆసనాలు వేస్తున్నాడని స్నేహితులు భావించారు. ఎంతకీ పైకి లేవకపోవడంతో దిగి చూస్తే అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే అచ్యుతాపురంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి అక్కడ నుంచి అనకాపల్లి ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. రాజు గుండెపోటుతో మృతిచెంది ఉంటాడని స్నేహితులు తెలిపారు. మృతుడి తండ్రికి గుండె సంబంధిత ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు వారు తెలిపారు. స్నేహితులతో సరదాగా గడపడానికి వచ్చి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరు పెట్టుకున్నారు. భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

వివాహిత ఆత్మహత్య

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: వల్లూరులో గులికల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకుంది. దీనికి సంబంధించి గ్రామీణ ఎస్సై సత్యనారాయణ కథనం ప్రకారం.. ఈ గ్రామానికి చెందిన వివాహిత ఎస్. జ్యోతి (25) అనకాపల్లిలోని ప్రైవేటు మాల్‌లో పనిచేస్తోంది. మంగళవారం రాత్రి తల్లి మందలించిందని మనస్తాపం చెందిన జ్యోతి గులికల మందు తాగింది. ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించగా విషమంగా ఉండడంతో కేజీహెచ్‌కు పంపారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. తల్లి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పిసినికాడ వద్ద రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందాడు. దీనికి సంబంధించి గ్రామీణ ఎస్సై సత్యనారాయణ కథనం ప్రకారం.. కశింకోట హౌసింగ్ కాలనీకి చెందిన పాచిలి శ్రీను (32) బైక్‌పై వస్తూ మంగళవారం రాత్రి అనకాపల్లి మండలం పిసినికాడ వద్ద రోడ్డు దాటుతున్న రాజగిరి కాశిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శ్రీను తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించగా బుధవారం మృతిచెందాడు. ఆ ప్రమాదంలో కాశీ కాలు విరిగింది.

బంగారు గొలుసు చోరీ

రాంబిల్లి, న్యూస్‌టుడే: బంగారం గొలుసు చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగేంద్ర చెప్పారు. ఆయన కథనం ప్రకారం.. లాలంకోడూరు గ్రామానికి చెందిన బండారు సుధీర్‌కుమార్ బుధవారం తెల్లవారు జామున నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి అతని మెడలో ఉన్న బంగారు గొలుసును దొంగిలించాడు. లేచిన తరవాత విషయం తెలుసుకుని ఫిర్యాదు చేశాడు.

బొజ్జన్న కొండ అభివృద్ధికి నిధుల సమీకరణ


ఉత్తమ సేవలందించిన పారిశుద్ధ్య కార్మికులతో సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు, కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: బొజ్జన్న కొండ రెండో విడత అభివృద్ధికి కావలసిన నిధులు సమీకరణకు కృషి చేస్తానని ఎంపీ సీఎం రమేశ్ పేర్కొన్నారు. బొజ్జన్నకొండపై బుధవారం ధ్యానమందిరం, లేజర్, లైట్ సౌండ్ షో కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ఎమ్మెల్యేలు, కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మొదటి అంతస్తులో బొజ్జన్న కొండ చరిత్ర తెలిపే విధంగా ఏర్పాటు చేసిన లేజర్ షో ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నాటి చరిత్రను కళ్లకు కట్టినట్లు చూపించారన్నారు. ఉదయం సమయంలో పర్యాటకులు, విద్యార్థులు తిలకించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ భావితరాలకు బొజ్జన్న కొండ చరిత్ర ఈ లేజర్‌షో ద్వారా సులభంగా తెలుస్తుందన్నారు. మాజీ శాసన సభ్యులు పీలా గోవింద సత్యనారాయణ ఈ లేజర్ షో ఏర్పాటుకు విశేషంగా కృషి చేశారని అభినందించారు. అనంతరం కలెక్టర్ విజయకృష్ణన్ కొండ వద్ద సదుపాయాలను, చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. అనంతరం పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛతే సేవ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పారిశుద్ధ్య కార్మికులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయ్‌కుమార్, జేసీ జాహ్నవి, ఆర్‌డీఓ చిన్నికృష్ణ, ప్రత్యేక ఉప కలెక్టర్ సుబ్బలక్ష్మీ, డీపీఓ శిరీషారాణి, ఈఓఆర్‌డీ నాగలక్ష్మీ, తహసీల్దార్ శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు వెంకన్న ఆలయం ముస్తాబు


ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన టెంట్లు

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాక వెంకన్న ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. గురువారం రాత్రి వేడుకలకు అంకురార్పణ చేస్తారు. అనంతరం స్వామివారికి అశ్వ వాహనంపై తిరువీధి సేవ ఉంటుంది. దీనిలో భాగంగా ఉదయం కావిడి ఉత్సవం ఉంటుంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రధాన ద్వారం మొదలు, ధ్వజస్తంభం, క్షేత్రపాలక ఆలయం తదితర ప్రాంతాల్లో రంగురంగుల టెంట్లను వేశారు. ఆలయానికి విద్యుద్దీపాలంకరణ చేశారు. అదేవిధంగా వేడుకలకు సంబంధించి ఫ్లెక్సీలు, కరపత్రాలను ముద్రించి ప్రచారం చేశారు. వైకాపా పాలనలో వేడుకలను పట్టించుకోకపోవడంతో తూతూ మంత్రంగా చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్వామివారికి జరుగుతున్న తొలి వేడుక ఇదే. దీంతోపాటు మంత్రి అనిత నియోజకవర్గం కావడంతో వేడుకల విషయంలో నిర్లక్ష్యం తగదన్న సమాచారం తితిదే అధికారులకు చేరింది. దీంతో ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు.

నేటి నుంచి శ్రీభగీరథీ అమ్మవారి ఉత్సవాలు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: హరిపాలెం-అందలాపల్లి శ్రీభగీరథీ అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటిరోజు అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. తొమ్మిది రోజులు వివిధ రూపాల్లో అలంకరించి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు దసరా రోజున ఇక్కడ అమ్మవారిని దర్శించుకోవడంతో పాటు శూలాల ఉత్సవంలో పాల్గొంటారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు. పలువురు భక్తులు మాలధారణ చేయనున్నారు. ఉత్సవాలకు సంబంధించిన ప్రచార గోడపత్రికను ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు బుధవారం అచ్యుతాపురంలో ఆవిష్కరించారు. ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కమిటీ ప్రతినిధులకు ఆయన సూచించారు.

ఇబ్బంది కలిగించే సర్వేరాళ్లు తొలగిస్తాం

స్పందనకు వందనం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: 'హద్దు రాయి.. ప్రమాదాలోయి!' శీర్షికన 'ఈనాడు'లో మంగళవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. హెచ్‌డీటీ శ్యామ్, ఆర్.ఐ. కుమార్ ఉప్పవరం మలుపులో ప్రమాదకరంగా ఉన్న జగనన్న భూసర్వే సరిహద్దు రాయిని తొలగించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే సర్వే రాళ్లను తొలగించాలని వీఆర్వోలను ఆదేశించారు.

రహదారిపై ఆటో బోల్తా

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

అనకాపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలోని బాలకృష్ణ బస్టాప్ సమీపాన బుధవారం ఆటో బోల్తా పడడంతో పెను ప్రమాదం తప్పింది. ఫర్నీచర్ లోడ్‌తో వెళ్తున్న ఆటో ఒక్కసారిగా అదుపు తప్పి రహదారికి అడ్డంగా పడిపోయింది. ఆ సమయంలో రహదారిపై వెనుకనే వస్తున్న వాహనదారులు అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు, వాహనదారులు అప్రమత్తమై బోల్తాపడిన ఆటోను పైకి లేపారు. స్వల్ప గాయాలతో ప్రయాణికులు బయటపడ్డారు. దీంతో కొంత సేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

భూ నిర్వాసితుల దరఖాస్తులపై చురుగ్గా విచారణ


రికార్డులను పరిశీలిస్తున్న రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: నక్కపల్లి మండలంలోని భూ నిర్వాసితులు పరిహారం ఇతర సమస్యలపై అందచేసిన దరఖాస్తులపై విచారణ చురుగ్గా సాగుతోంది. స్థానిక సబ్ కలెక్టరేట్‌లో ఆర్‌డీఓ వి.వి.రమణ పర్యవేక్షణలో ఆ మండలంలోని రెవెన్యూ, సర్వే అధికారులు ఏపీఐఐసీ ఉన్నతాధికారులు బుధవారం రికార్డులు అన్నింటిని సమగ్రంగా పరిశీలించారు. నిర్వాసితుల సమస్యలపై 17న కలెక్టర్ నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్‌లో రైతుల నుంచి 441 దరఖాస్తులు అందాయి. మళ్లీ 25న నక్కపల్లి తహసీల్దారు కార్యాలయంలో చేపట్టిన కార్యక్రమంలో 548 అర్జీలు వచ్చాయి. భూములకు పరిహారం చెల్లింపు, ఇతర సమస్యలపై వీరు నుంచి దాఖలైన వీటిపై కలెక్టర్ ఆదేశాలతో ఇప్పుడు సమగ్ర విచారణ నిర్వహిస్తున్నారు. పరిహారానికి అర్హులైనవారి వివరాలు సేకరిస్తున్నామని ఆర్‌డీఓ రమణ తెలిపారు. ఇందులో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ హరిప్రసాద్, ప్రత్యేక ఉప కలెక్టర్ రమామణి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నాటకోత్సవాలు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ సంఘం మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో ఈనెల 3 నుంచి 7 వరకు రోజూ సాయంకాలం ఉభయ తెలుగు రాష్ట్రాల నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కనకదుర్గ అమ్మవారి ఆలయ వ్యవస్థాపకులు రమణ, పర్యవేక్షకులు నాయుడు తెలిపారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	110	104
లైవ్	132	124
డ్రెస్డ్	191	218
స్కిన్‌లెస్	218	228

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా, రామచంద్ర, పర్తిసాయి, సత్యనారాయణ స్క్రీన్1, వెంకటేశ్వర: **దేవర**, శ్రీ సత్య: **జెంటిల్‌మేన్**
సత్యనారాయణ స్క్రీన్2: **మత్తు వదలరా**
షిర్డిసాయి: **సత్యం సుందరం**
అచ్యుతాపురం, న్యూస్‌టుడే:
శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1లో **సత్యం సుందరం**, స్క్రీన్-2లో **దేవర**

బస్సు అద్దాలు పగలగొట్టిన ఆకతాయిలు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ముగ్గురు ఆకతాయిలు పేటలో వీరంగం సృష్టించారు. బుధవారం రాత్రి అనకాపల్లి నుంచి పాయకరావుపేట వచ్చిన ఆర్టీసీ బస్సు అద్దాలు పగలకొట్టారు. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఆర్టీసీ డ్రైవరు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. మిగతా ఇద్దరు పరారయ్యారు. దీనిపై విచారణ చేసి కేసు నమోదు చేస్తున్నామని సీఐ అప్పన్న తెలిపారు.

నేడు ఎలమంచిలిలో అన్నక్యాంటీన్ ప్రారంభం

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలిలో అన్నక్యాంటీన్ బుధవారం ప్రారంభించేందుకు కూటమి నాయకులు భారీ ఏర్పాట్లు చేశారు. రూ. 14 లక్షల వరకూ ఖర్చు చేసి దీనికి మెరుగులు దిద్దారు. అన్ని వసతులు కల్పించారు. రోజుకు 500 మందికి భోజనం, అల్పాహారం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ చెప్పారు.



అ వీ ఇ వీ

పేటలో ఎంపీ పర్యటన నేడు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పార్లమెంట్ సభ్యుడు సీఎం రమేశ్ గురువారం మధ్యాహ్నం పాయకరావుపేటకు రానున్నారు. పి.ఎల్.పురం కూడలి వద్ద కల్యాణమండపంలో జరిగే భాజపా సభ్యత్వ నమోదుకు హాజరవుతారని పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.రవిరాజు, కన్వీనరు శ్రీరంగం రమేష్ తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: కొరుప్రోలు సెక్షన్ పరిధిలోని గుడివాడ, కొత్తపోలవరం, ధర్మవరం-అగ్రహారం గ్రామాలకు గురువారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

నేడు ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఈదురుగాలులకు చెట్లుకూలి విద్యుత్తు స్తంభాలు నేలకొరిగిన కారణంగా గురువారం ఎలమంచిలి పట్టణంలో కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా చేయడం లేదని స్థానిక మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్తు సరఫరా నిలిచిపోవడం వల్ల తాగునీరు ట్యాంకుల్లోకి నింపడానికి వీలు కాలేదన్నారు. ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని, పుర ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

సంపద కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయం

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని ఎంపీడీవో కొండలరావు పేర్కొన్నారు. బుధవారం పోతిరెడ్డిపాలెం గ్రామంలో సర్పంచి ఇత్తంశెట్టి సన్యాసినాయుడుతో కలిసి కేంద్రంలో వానపాములు విడుదల చేశారు. ఈవోపీఆర్‌డీ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మోసయ్యపేటలో విద్యుత్తు పునరుద్ధరణ

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: మోసయ్యపేటలో మర్రిచెట్టు కూలిపోవడంతో నిలిచిన విద్యుత్తు సరఫరాను అధికారులు పునరుద్ధరించారు. ఏఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పనులు నిర్వహించారు. విరిగిపోయిన స్తంభాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసి మోసయ్యపేటకు సరఫరాను అందించారు.

పోషకాహార ప్రాధాన్యం తెలుసుకోండి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: పోషకాహార ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని విజయవాహిని చారిటబుల్ ట్రస్ట్ పోషణ సఖీ ఉషారాణి కోరారు. ఖాజీపాలెంలో బుధవారం అవగాహన సదస్సు, ర్యాలీ కార్యక్రమాలు జరిగాయి. కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి ఉమా పాల్గొన్నారు.

పీలాకు సత్కారం

అనకాపల్లి: పట్టణ ఆర్థిక మౌలిక వసతుల కల్పన సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణను బుధవారం పట్టణంలోని పలు దేవస్థానాలకు చెందిన సభ్యులు సత్కారించారు. వేల్పుల వీధి, గవరపాలెం గౌరీ పరమేశ్వర్ల ఉత్సవ కమిటీ సభ్యులు, కనకదుర్గ అమ్మవారి దేవస్థానం సభ్యులు వేర్వేరుగా కలిసి సత్కరించారు.


పీలాను సత్కరిస్తున్న మహిళలు

జంపపాలెం జాతరకు తరలిన భక్తులు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: జంపపాలెం గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించిన మరిడిమాంబ ఉయ్యాల పోటీల తిలకించడానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఇసుక విధానంపై రేపు ఆందోళన

కొత్తూరు(అనకాపల్లి), న్యూస్‌టుడే: సామాన్యులకు సైతం మేలు చేసేలా ఉచిత ఇసుక పథకాన్ని ప్రభుత్వం పక్కాగా అమలు చేయాలని కోరుతూ 4న జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఉచిత హామీ వల్ల గతంలో కంటే ధరలు పెరిగాయని బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. దీంతో ప్రభుత్వ ఇసుక విధానంపై వినియోగదారులు, కార్మికులు తీవ్ర అసహనంతో ఉన్నారన్నారు. భవన నిర్మాణాలు మందకొడిగా సాగుతున్నాయని గుర్తుచేశారు. జిల్లా కేంద్రం అనకాపల్లితో పాటు మండల కేంద్రాల్లో నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి - 80085 74722
ఎలమంచిలి - 80085 74726
పాయకరావుపేట - 80085 74749

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే


సమస్య: విద్యుత్తునగర్‌లో సీసీ రోడ్డు మరమ్మతులకు గురయ్యింది. ఏళ్ల తరబడి ఇవి మరమ్మతులకు నోచుకోవడం లేదు.
– పవన్‌కుమార్, అనకాపల్లి.

సమాధానం: సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ప్రతిపాదనలు తయారుచేశాం. పనులు చేపట్టి సమస్య పరిష్కరిస్తాం.
– ఈశ్వరరావు, తుమ్మపాల పంచాయతీ కార్యదర్శి

వీడని నిర్లక్ష్యం.. అలుముకున్న అంధకారం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

వీధిలైట్ల నిర్వహణలో నిర్లక్ష్యం అనకాపల్లిలో అంధకారం అలుముకుంటోంది. వర్షాల నేపథ్యంలో లైట్లు మరమ్మతులకు గురవుతున్నా ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించడంలో జాప్యం నెలకొంటోంది. అనకాపల్లి జిల్లా కేంద్రంతో పాటుగా విలీన గ్రామాలను కలిపి 7,800 వీధి లైట్లు ఉన్నాయి. రింగ్ పోల్స్ 112 ఉన్నాయి. వర్షాలకు ఎల్‌ఈడీ వీధిలైట్లు ఎక్కువగా దెబ్బతింటున్నాయి. పట్టణంలో 220కి పైగా లైట్లు వెలగడం లేదని అధికారులకు ఫిర్యాదులు అందాయి. అయినా వీటిని బాగుచేయలేదు. గవరపాలెం, గాంధీనగరం, విజయరామరాజుపేట, బర్మాకాలనీ, లక్ష్మీనారాయణనగర్, కొట్నీవీధి, మళ్లవీధి ప్రాంతాల్లో ఈ సమస్యపై ఫిర్యాదులు అందాయి. జీవీఎంసీ విద్యుత్తు విభాగం నుంచి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించే వారు.


వీధిలైట్లు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కమిషనర్ ఆదేశించినా..

వీధిదీపాలు సరిగా వెలగడం లేదు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నా రెండేళ్లుగా ఏమీ చేయలేకపోతున్నారు. కొన్నిచోట్ల స్తంభాలు లేవు. గుత్తేదారుడిని వెంటనే మార్చాలంటూ విశాఖపట్నంలో సెప్టెంబరు 25న జరిగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో పలువురు కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. వెంటనే చర్యలు తీసుకుని వీధిలైట్లు అన్నీ వెలిగించేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ సంపత్ కుమార్ హామీ ఇచ్చినా అనకాపల్లిలో మాత్రం ఈ పరిస్థితి మారలేదు.

సామగ్రి అందుబాటులో లేక మరమ్మతులు జాప్యం నెలకొంది. శివారు ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నా ఆ ప్రాంతాల్లో వీధిలైట్లు ఏర్పాటు చేయలేదు. ఇటీవల అనకాపల్లిలో 15 రింగుపోల్స్‌తో పాటు వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు రూ.20లక్షలతో ప్రతిపాదనలు తయారుచేశారు. నిధులు మంజూరు చేస్తే ఈ పనులు జరిగే



అవకాశం ఉంది. వీధిలైట్ల మరమ్మతులతో పాటు శివారు ప్రాంతాల్లో లైట్లను ఏర్పాటు చేసి అంధకార సమస్యను పరిష్కరించాలని అనకాపల్లి వాసులు కోరుతున్నారు.

వర్షాలతో ఇబ్బందులు



వర్షాలు పడటం వల్ల వీధిలైట్లు మరమ్మతులకు గురవుతున్నాయి. ఎప్పటికప్పుడు ఈ సమస్య ఉండేలా గుర్తించి ఆయా ప్రాంతాల్లో వీధిలైట్లను వెంటనే బాగుచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజాప్రతినిధుల సూచనల మేరకు రింగుపోల్స్ ఏర్పాటుచేసేలా ప్రతిపాదనలు పంపాం. శివారు ప్రాంతాల్లో అవసరమైన చోట లైట్లు ఏర్పాటు చేస్తాం.
– నానాజీ, ఏఈ, అనకాపల్లి

శాకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

లక్ష్మీదేవిపేట(అనకాపల్లి), న్యూస్‌టుడే: శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. గవరపాలెంలో బుధవారం పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శాకాహార సద్భావన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ మానవశరీరం శాకాహారంతోనే నిర్మితమైందన్నారు. కూరగాయల్లో పుష్కలమైన విటమిన్లు ఉన్నాయన్నారు. ప్రోటీన్లు పుష్కలంగా ఉన్నాయన్నారు. జంతుహింసకు దూరంగా ఉండాలన్నారు. పలువురుప్రతినిధులు పాల్గొన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

మున్సిపల్ ఉపాధ్యాయుల సత్యాగ్రహ దీక్ష


దీక్షలో పాల్గొన్న ఉపాధ్యాయులు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: ప్రభుత్వం మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారం కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో అనకాపల్లి నెహ్రూచౌక్ కూడలిలో బుధవారం సత్యాగ్రహ దీక్షను చేపట్టారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీసులు విద్యాశాఖ పరిధిలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ప్రధాన సమస్యలు నేటికి పరిష్కారం కాలేదన్నారు. ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయుల పోస్టులకు అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించాలన్నారు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. సత్యాగ్రహదీక్షకు సీఐటీయూ నాయకులు కోటేశ్వరరావు మద్దతూ తెలిపారు. యూటీఎఫ్ అధ్యక్షులు వి.శ్రీలక్ష్మి, జిల్లా కార్యదర్శి గొంది చినబ్బాయి, సభ్యులు అక్కునాయుడు, రాజునాయుడు, భాషా, జోగా రాజేష్, శేషుకుమార్, ప్రకాష్, అప్పారావు, ఈశ్వర్ పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ముస్తాబు

అనకాపల్లి, లక్ష్మీదేవి పేట, అచ్యుతాపురం, న్యూస్‌టుడే: గవరపాలెం సతకంపట్టు కనకదుర్గ ఆలయంలో దసరా ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 3 నుంచి 12వ తేదీ వరకు ఉత్సవాలను రంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ ఆర్థిక సహాయంతో భవానీ మాలధారణ వేసిన భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కొత్తూరు నరసింగరావుపేటలో 20 అడుగులు అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. సిరసపల్లి చింతామణి గణపతి దత్తక్షేత్రంలో ఈ వేడుకలకు ఏర్పాట్లు చేశారు. నునపర్తి కనకదుర్గమ్మ ఆలయం శరన్నవరాత్రుల ఉత్సవాలకు ముస్తాబైంది. రోజుకో రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

నక్కపల్లి, న్యూస్‌టుడే: దసరా వేడుకలకు సంబంధించి గ్రామాల్లో ఏర్పాట్లు చేశారు. నక్కపల్లి, కాగిత, ఉపమాక, గొడిచెర్ల తదితర గ్రామాల్లో మండపాలు తయారు చేశారు. అమ్మవారిని గురువారం నిలబెట్టనున్నారు. ఇందుకోసం పలుచోట్ల ఆలయాలను ముస్తాబు చేశారు. దీనిలో భాగంగా విద్యుద్దీపాలు, పూలతో అలంకరించారు.


అనకాపల్లిలో కనకదుర్గ అమ్మవారు


నునపర్తిలో..

కాశీయాత్రకు తరలిన భక్తులు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: మండలంలోని పాల్తేరు నుంచి కాశీ యాత్రకు పెద్దఎత్తున భక్తులు తరలివెళ్లారు. దేవవరపు లోవరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయవాది దేవవరపు రాంబాబు ఏటా భక్తులను యాత్రకు తీసుకువెళుతున్నారు. యాత్రకు తుని తపోవనం స్వామీజీ సచ్చిదానంద సర్వస్వతి శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలతో కాశీ దర్శనానికి పంపించడం ప్రశంసనీయమన్నారు. జనసేన నాయకుడు తోట నగేష్, డి.వెంకటరమణ, డి.అర్జునరావు, వి.వెంకటేష్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.


భక్తులతో సచ్చిదానంద సరస్వతి

భవానీలకు బిక్ష

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లిలోని సుబ్బిరామిరెడ్డి కల్యాణ మండపంలో బుధవారం భవానీ భక్తులకు భారీ బిక్ష ఏర్పాటు చేశారు. దసరా సందర్భంగా అమ్మవారికి మొక్కుబడుల్లో భాగంగా అనేక మంది భవానీ మాల ధరించారు. కాగా నక్కపల్లికి చెందిన పలువురు భవానీలు ప్రతి రోజూ భక్తులకు ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు దాతలు ముందుకు రావడంతో బిక్షను ఏర్పాటు చేశారు. తొలి రోజున కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మేడేటి శంకర్ తనవంతు సాయం అందించారు.


నక్కపల్లిలో బిక్ష చేస్తున్న భక్తులు

గాంధీమార్గం..అనుసరణీయం


అనకాపల్లిలో గాంధీ విగ్రహానికి నివాళి


కశింకోటలో..


గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు పూలమాల వేస్తున్న డీఆర్వో


శంకరంలో..


మోసయ్యపేటలో..

కలెక్టరేట్, కొత్తూరు(అనకాపల్లి), కశింకోట, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి ఆశయ సాధనకు కృషి చేయాలని డీఆర్వో బి.దయానిధి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం వీరి జయంతి సందర్భంగా చిత్రపటాలకు ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. డీఎల్‌డీవో మంజులవాణి, డీపీవో శిరీషారాణి, సీపీవో రామారావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. డీఆర్‌డీఏ కార్యాలయంలో పీడీ శచీదేవి గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఏఎంఏఎల్, ఆస్క్ కళాశాలలు, ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ గెల్లా జయబాబు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బొడ్డేడ అప్పారావు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. శంకరం పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులను సత్కరించి సర్పంచి లక్ష్మి నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. కశింకోటలో బుధవారం స్వచ్ఛతే సేవలో తహసీల్దారు శ్రీనివాసరావు, ఎంపీడీవో రవికుమార్ వీధులను శుభ్రం చేశారు.

ఎలమంచిలి, అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక, న్యూస్‌టుడే: మార్టూరులో కేకేవీఎన్‌వర్మ సేవా సంఘం ఆధ్వర్యంలో పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు. మోసయ్యపేటలో తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు, అచ్యుతాపురంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సోమునాయుడు గాంధీ విగ్రహానికి వెదురువాడ ప్రాథమికోన్నత పాఠశాలలో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించి 100 మంది యువకులు రక్తదానం చేశారు. స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో భాగంగా ఖాజీపాలెం, వెదురువాడ, అచ్యుతాపురం గ్రామాల్లో ర్యాలీలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. మునగపాక సంపద కేంద్రంలో గాంధీ చిత్రపటానికి డీఎల్‌డీఓ మంజుల వాణి, ఎంపీడీఓ ప్రసాద్‌కుమార్, తహసీల్దార్ ఉమామహేశ్వరరావు, తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. ఎలమంచిలి మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ రమాకుమారి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కమిషనర్ బాకూరి ప్రసాదరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. రాంబిల్లి ఉన్నత పాఠశాలలో గాంధీ విగ్రహానికి కూటమి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. దిమిలిలో గాంధీ విగ్రహానికి మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు కొఠారు దల్లమ్మదేవి, ఉపసర్పంచి నగిరెడ్డి మురళీకృష్ణ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.


కోటవురట్లలో ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్ తిరుమలబాబు తదితరులు


మునగపాకలో పారిశుద్ధ్య కార్మికులను సత్కారం


పాయకరావుపేటలో..

చేనేత వస్త్రాలను వాడాలి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లిలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను ఎంపీ సీఎం రమేశ్ ప్రారంభించారు. చేనేత వస్త్రాలను అందరూ వాడాలని పిలుపునిచ్చారు. భాజపా జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పాల్గొన్నారు గాంధీబొమ్మ కూడలి వద్ద మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద తెదేపా రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, జీవీఎంసీ జోనల్ కమిషనర్ అప్పలనాయుడు గాంధీ విగ్రహాలకు నివాళి అర్పించారు. మహాత్మగాంధీ జయంతి వేడుకలను అనకాపల్లిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ కార్యాలయంలో ఎస్‌బీ డీఎస్పీ అప్పారావు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.


చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభిస్తున్న సీఎం రమేశ్

స్వచ్ఛతే సేవతో గ్రామాల అభివృద్ధి

పాయకరావుపేట, నక్కపల్లి, కోటవురట్ల, ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: పరిసరాలను శుభ్రంగా ఉంచినప్పుడే గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీడీఓ డి.సీతారామరాజు వెల్లడించారు. నక్కపల్లి మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో తెదేపా మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, వీసం రామకృష్ణ, కొప్పిశెట్టి కొండబాబు తదితరులతో కలిసి ఆవరణను పరిశుభ్రం చేశారు. కోటవురట్లలో మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ, ఎంపీడీఓ కాశీ విశ్వనాథరావు, తహసీల్దార్ తిరుమలబాబు తదితరులు ర్యాలీ నిర్వహించారు. కోటవురట్లలో పారిశుద్ధ్య కార్మికులను సర్పంచి అనిల్‌కుమార్ సన్మానించారు. పాయకరావుపేటలో గాంధీజీ విగ్రహానికి తెదేపా మండలశాఖ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు నివాళులర్పించారు. చినదొడ్డిగల్లులో ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ తన సొంత నిధులతో పారిశుద్ధ్య కార్మికులకు ఉచితంగా దుస్తులు అందించారు. కోటవురట్ల బస్‌షెల్టర్ దగ్గర ఉన్న గాంధీజీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ సభ్యులు, ఎంపీడీఓ కాశీ విశ్వనాథరావు పూలమాల వేశారు. పెనుగొల్లు పంచాయతీలో సర్పంచి ఉద్దండం నాగశ్రీదేవి, తెదేపా నాయకులు, తిమ్మాపురం శివారు కోనవానిపాలెంలో కూటమి నాయకులు వీధులను శుభ్రం చేశారు.


నక్కపల్లి మండల పరిషత్తు ఆవరణలో..

జీవ వైవిధ్య పరిరక్షణకు కృషి

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: జీవవైవిధ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పట్టణ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. తుమ్మపాలలో వన్యప్రాణి సంరక్షణపై అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం సంస్థ ప్రాంగణంలో మొక్కలు నాటారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ విజయ్‌కుమార్

నూతన మద్యం పాలసీని రద్దు చేయండి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: నూతన మద్యం పాలసీని రద్దు చేయాలని ఐద్వా జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.మాణిక్యం, డీడీ వరలక్ష్మి అనకాపల్లిలో బుధవారం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ర్యాలీ చేపట్టి కూడళ్లలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రభుత్వం మద్య నిషేధం ప్రకటించాలని, కోరారు. లేని పక్షంలో ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహించాలన్నారు. ప్రభుత్వం లైసెన్స్ విధానాన్ని ప్రవేశ పెట్టి, లైసెన్స్ రుసుముల ద్వారానే రూ. 200 కోట్ల ఆదాయం పొందే చర్యలు సరికాదన్నారు. లక్ష్మి, నారాయణమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


రహదారిపై ప్రతినిధుల నిరసన

కనీస వేతనాలు ఇవ్వలేరా?

రాంబిల్లి, న్యూస్‌టుడే: నావికాస్థావరం ప్రాజెక్టులో పనిచేస్తున్న కార్మికులకు చట్టాలు వర్తింపచేయాలని సీఐటీయూ ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నావికాస్థావరం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా దేముడునాయుడు మాట్లాడుతూ వలస కూలీలతో రోజుకు 12 గంటల పాటు పనిచేయించుకొని కనీస వేతనాలు అమలుచేయడం లేదని మండిపడ్డారు. ఏడాది పూర్తయిన కార్మికులకు బోనస్ చెల్లించడం లేదన్నారు. ఇప్పటికీ ఈ సమస్యను పరిష్కరించడం లేదన్నారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వని నిర్మాణ సంస్థలపై చర్యలు తీసుకోవాలని, లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.నారాయణరావు, వై.రాము పాల్గొన్నారు.


తహసీల్దారు కార్యాలయం వద్ద కార్మికుల ఆందోళన

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

తండ్రికి కూతురు తలకొరివి పెట్టిన ఉదంతం కశింకోటలో చోటుచేసుకుంది. గాడివీధికి చెందిన పాసిలి శ్రీను చెన్నైలో తాపీమేస్త్రీగా పని చేస్తున్నాడు. ఇటీవల ఇక్కడకు వచ్చిన శ్రీను రోడ్డు ప్రమాదంలో గాయపడి బుధవారం మృతి చెందాడు. ఆయనకు భార్య లక్ష్మి, కుమార్తెలు సీత, లేఖిని ఉన్నారు. కుమారులు లేకపోవడంతో పెద్దకుమార్తె సీత తండ్రికి తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది. ఈ సంఘటన స్థానికులను కంటతడి పెట్టించింది. – కశింకోట, న్యూస్‌టుడే



హోరాహోరీగా జిల్లాస్థాయి చెడుగుడు పోటీలు

ఎలమంచిలి గ్రామీణం, అచ్యుతాపురం, న్యూస్‌టుడే: మరిడిమాంబ పండగ సందర్భంగా జంపపాలెంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి చెడుగుడు పోటీలు మంగళవారం రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుతురులో జరిగాయి. సర్పంచి శిలపరశెట్టి దేవకినాయుడు ఈ పోటీలను ప్రారంభించారు. మూడురోజుల పాటు జరిగే ఈ పోటీల్లో మంగళవారం రాత్రి 16 టీమ్‌లు తలపడ్డాయి. చూచుకొండ, గణపర్తి, వాడ్రాపల్లి, సోమలింగపాలెం జట్లు ఫైనల్‌కు చేరాయి. గురువారం తుది పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేస్తామని నిర్వాహకులు టెక్కలి తాతారావు, శ్రీను, పిల్లా కుమార్ తెలిపారు. చదరంగం, ఖోఖో, బ్యాడ్మింటన్, జావలిన్‌త్రో పోటీల్లో అచ్యుతాపురానికి చెందిన పది మంది జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని పలువురు అభినందించారు.


తలపడుతున్న వాడ్రాపల్లి- సోమలింగపాలెం జట్లు

అల్లుకున్న ప్రమాదం..

ఎలమంచిలి, నక్కపల్లి, న్యూస్‌టుడే

విద్యుత్తు లైన్ల నిర్వహణపై అధికారులు దృష్టి సారించడంలేదు. విద్యుత్తు స్తంభాలు, తీగలను తీగజాతి మొక్కలు దట్టంగా అలముకున్నాయి.


సీహెచ్‌ఎల్‌పురంలో..


ఎలమంచిలిలో..

ఎలమంచిలి-అచ్యుతాపురం రోడ్డులో ఎనిమిది చోట్ల స్తంభాలను దట్టంగా తీగమొక్కలు అలముకున్నాయి. ఎలమంచిలి జంపపాలెం రోడ్డులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఎలమంచిలి, రాంబిల్లి, పీఎన్‌ఆర్‌పేట, ఏటికొప్పాక రోడ్లకు ఇరువైపులా ఉన్న స్తంభాలను మొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. వర్షాలు కురిసినప్పుడు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సోమలింగపాలెంలో గతంలో ఒకరు చనిపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

★ నక్కపల్లి మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్తు స్తంభాలపై తుప్పలు అల్లుకుపోతున్నాయి. స్తంభం పొడవునా తుప్పలు అల్లుకుపోయి ప్రమాదాలకు తావిచ్చేలా ఉన్నా విద్యుత్తు సంస్థ అధికారులు తొలగించే దిశగా చర్యలు తీసుకోవడం లేదు. సీహెచ్ఎల్‌పురంలో పలు చోట్ల ఈ పరిస్థితి ఉంది. ఈ విషయం విద్యుత్తు పంపిణీ సంస్థ ఏఈ కృష్ణ దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందిని పంపించి తక్షణమే వీటిని తొలగింపజేస్తామని చెప్పారు.


జంపపాలెం రోడ్డులో..

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల



ఖైదీలకు మిఠాయిలు అందజేస్తున్న అదనపు జూనియర్ సివిల్ జడ్జి సూర్యకళ

సత్ప్రవర్తనతో సాఫీగా జీవితం

చోడవరం, న్యూస్‌టుడే: సత్ప్రవర్తనతో, శాంతియుతంగా మెలిగితే జీవితం సాఫీగా సాగుతుందని స్థానిక అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.సూర్యకళ అన్నారు. ఉద్రేకంగా వ్యవహరించడం అనర్థాలకు దారి తీస్తుందని పేర్కొన్నారు. స్థానిక ఉప కారాగారంలో బుధవారం గాంధీ జయంతి నిర్వహించారు. ఖైదీలకు మిఠాయిలు, పండ్లు అందజేశారు. మంచి నడవడిక అలవర్చుకోవాలని సూచించారు.

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి1: **సత్యం సుందరం**, ఆడి2: ఆడి3: **దేవర**, ఆడి4: **దేవర, మత్తు వదలరా**, రాజు: **దేవర, సత్యం సుందరం**, బంగార్రాజు: **దేవర**
చోడవరం: శ్రీసాయిలక్ష్మి: **సత్యం సుందరం**, సాయిలక్ష్మి: **మత్తు వదలరా**, పూర్ణా: **దేవర**

అ వీ ఇ వీ

మద్యం సీసాల స్వాధీనం

రావికమతం, న్యూస్‌టుడే: కొత్తకోట మెయిన్‌రోడ్డులోని మద్యం గొలుసు దుకాణంపై దాడి చేసి తొమ్మిది సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌.ఐ.శ్రీనివాసరావు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

100.30 మీటర్లకు కోనాం నీటిమట్టం

చీడికాడ, న్యూస్‌టుడే: ఎగువ గెడ్డల నుంచి కోనాం జలాశయంలోకి 900 క్యూసెక్కుల వరదనీరొచ్చి చేరుతోంది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, బుధవారం నాటికి 100.30 మీటర్లకు పెరిగింది. దీంతో అప్రమత్తమైన జలవనరుల శాఖ అధికారులు స్పిల్‌వే గేట్లు, తూముల నుంచి 150 క్యూసెక్కుల నీటిని దిగువ బొడ్డేరు నదిలోకి విడుదల చేస్తున్నారు.

ఎమ్మార్పీఎస్ సీనియర్ నేత మృతి

దేవరాపల్లి: ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు ఏలుసూరి మహాలక్ష్మి మాదిగ (75) దేవరాపల్లిలో ఆయన స్వగృహంలో మృతి చెందారు. కొద్దిరోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన మృతిపట్ల సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏలుసూరి పాతలయ్య మాదిగ, మాదిగ ఉద్యోగ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

మినీ గోకులం పెండింగ్ బిల్లులపై విచారణ

మాడుగుల గ్రామీణం: మాడుగులలో 2018-21 మధ్య కాలంలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన మినీ గోకులం షెడ్లను పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ, గౌరీ శంకర్ తదితరులు బుధవారం పరిశీలించారు. బిల్లుల బకాయిలపై వివరాలు సేకరించారు. బ్యాంక్ ఖాతా లావాదేవీల వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

గ్యాస్ సరఫరాలో అక్రమాలకు చెక్

నర్సీపట్నం, న్యూస్‌టుడే

వంట గ్యాస్ సిలిండర్‌కు ఇప్పుడు ఓటీపీ తప్పనిసరి అవుతోంది. మారిన కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఇప్పుడు పక్కా ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేస్తున్నారు. కోట్లాది రూపాయల రాయితీలతో పేదలకు అందజేస్తున్న వీటిలోనూ అక్రమాలు సర్వసాధారణం అవుతున్నాయి. వీటికి అడ్డుకట్ట వేసేందుకు వన్ టైం పాస్‌వర్డ్ (ఓటీపీ) పద్ధతిని విధిగా పాటించేలా చర్యలు తీసుకుంటున్నారు.

అందరి ఇంట వంటగ్యాస్ తప్పనిసరిగా ఉంటోంది. వాణిజ్య సిలిండర్లతో పోలిస్తే గృహవినియోగ సిలిండర్ల ధర తక్కువ. ఈ నేపథ్యంలో గృహ వినియోగానికి కేటాయించిన బండలను పక్కదారి పట్టిస్తున్నారని గ్రహించి ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇందులో సైతం అక్రమాలు యథావిధిగా కొనసాగుతున్నాయి. సరైన విధానం అమలులో లేక ఎప్పటిలాగానే వీటి బుకింగ్‌లో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయి. వీటిని నివారించేందుకు తీసుకువచ్చిన మిస్డ్ కాల్ విధానంతోనూ అక్రమాలకు అడ్డుకట్ట పడలేదు. పలుకుబడి ఉన్న వారంతా ఇష్టానుసారం పొందేందుకు అవకాశం ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఓటీపీ విధానాన్ని తప్పనిసరి చేయడం ద్వారా ఇవన్నీ కట్టడి అవుతాయని భావిస్తున్నారు.



వినియోగదారు నుంచి ఓటీపీ తెలుసుకుంటున్న డెలివరీ బాయ్

హెచ్‌పీ, ఇండేన్, భారత్ గ్యాస్ సంస్థల ద్వారా ప్రజలకు గ్యాస్ పంపిణీ అవుతోంది. నర్సీపట్నం డివిజన్‌లో హెచ్‌పీ డీలర్లు 28 వేల మంది వినియోగదారులకు వీటిని సరఫరా చేస్తున్నారు. వీటిలో 12 వేల వరకు దీపం కనెక్షన్లు ఉన్నాయి. ఇండేన్‌లో మొత్తం 24 వేల మంది, భారత్‌లో మరో 10 వేల మంది వినియోగదారులు ఉన్నారు. వీరంతా ఇప్పుడు విధిగా ఓటీపీ ద్వారానే సిలిండర్లు పొందాల్సి ఉంటుంది.

వినియోగదారుడే విధిగా బుక్ చేసుకోవాలి

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో వారం రోజుల నుంచి ఓటీపీ విధానంతోనే గ్యాస్ పంపిణీ చేపడుతున్నాం. ప్రతి వినియోగదారు స్వయంగా తానే ఐవీఆర్ఎస్‌లో దీనిని బుక్ చేసుకోవాలి. దీనికి గ్యాస్ వినియోగదారుని సంఖ్యతో చరవాణి నంబరు అనుసంధానమై ఉండాలి. దీని ద్వారా మిస్డ్ కాల్ ఇస్తే గ్యాస్ బుక్ అవుతుంది. ఏజెన్సీ ఉద్యోగి బండను ఇంటికి తీసుకువచ్చి వినియోగదారుని ఓటీపీని ఖరారు చేసుకొని దానిని అందజేస్తారు..సందేహాలు ఉంటే కార్యాలయంలో సంప్రదించవచ్చు. – తోట విద్యాసాగర్, హెచ్‌పీ గ్యాస్ డీలర్

ఎన్నాళ్లీ అవస్థలు..

రావికమతం, న్యూస్‌టుడే: బీఎన్ రోడ్డుపై అవస్థల ప్రయాణం తప్పడం లేదు. ఇంకా ఎన్నాళ్లీ ఇబ్బందులంటూ ఈ మార్గంలో ప్రయాణించే వారంతా అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొత్తకోట జడ్పీ హైస్కూలు వద్ద రోడ్డు దారుణంగా తయారైంది. బస్టాప్ నుంచి ఆసమ్మ బడి వరకు పెద్దపెద్ద గోతులు పడ్డాయి. ఈ గోతుల్లో వాహనాలు తరచూ ఆగిపోతున్నాయి. ఐదు రోజుల కిందట సరుగుడు లోడు లారీ, ఆర్టీసీ బస్సు ఆగిపోగా పొక్లెయిన్‌తో బయటకు నెట్టాల్సి వచ్చింది. అదే చోట సోమవారం వ్యాను, లారీ ఆగిపోయాయి. కొత్తకోట ఎస్సై శ్రీనివాసరావు చొరవతో సర్పంచి లోవరాజు, ఉప సర్పంచి దేవా హైస్కూలు వద్ద గోతులు పూడ్చివేతకు చర్యలు చేపట్టారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు రహదారి మరమ్మతుకు వెంటనే చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు గోవింద తదితరులు డిమాండు చేశారు.



కొత్తకోట హైస్కూలు వద్ద బీఎన్ రోడ్డు దుస్థితి

నిర్లక్ష్యానికి ఎవరు చెల్లిస్తారు మూల్యం?

గొలుగొండ, న్యూస్‌టుడే

చాలా ప్రాంతాల్లో వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్తు సరఫరా అందించే తీగలు వాలిపోయి, స్తంభాలు కూలేందుకు సిద్ధంగా ఉండి ఆందోళన కలిగిస్తున్నాయి. గట్టిగా గాలులు వీస్తే ఏ క్షణాన ప్రమాదం ముంచుకొస్తుందోనని అన్నదాతలు భయపడుతున్నారు. కొత్తమల్లంపేట, రేఖపల్లి, చోద్యం తదితర ప్రాంతాల్లో ఐదేళ్లగా ఈ సమస్య వెంటాడుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి తీగలు తగిలి ఈ మధ్యనే ఏటిగైరంపేటకు చెందిన ఓ వ్యవసాయ కూలి మృతి చెందాడు. ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోతే మూల్యం ఎవరు చెల్లించాలని ప్రశ్న ఎదురవుతోంది.



రేఖపల్లి వద్ద తీగలకు దన్నుగా కర్రలు



కొత్తమల్లంపేట-రేఖపల్లి మధ్య..



కొత్తమల్లంపేట వరి పొలాల్లో వాలిన స్తంభాలు

గండం.. పట్టించుకుంటే మీకో దండం!

నాతవరం నుంచి తూర్పు గోదావరి సరిహద్దు రహదారిలో చినపేట సమీపంలో రోడ్డు మధ్య రంధ్రం పడింది. వాహనదారులకు తెలిసేలా కొమ్మలను అడ్డు పెట్టారు. వీటిని తొలగించి చూస్తే లోలోపల భారీగా కోరివేతకు గురై గుల్లగా మారింది. ద్విచక్ర వాహనాలు, మరేదైనా వాహనం పొరపాటున ఇక్కడ పరిస్థితిని గుర్తించక వెళ్తే ప్రమాదానికి గురవడం ఖాయం. ఈ విషయమై ర.భ అధికారులకు సమాచారం ఇచ్చామని పిచ్చిగంటి కొత్తగూడేనికి చెందిన యువకుడు వరహాలబాబు తెలిపాడు. – న్యూస్‌టుడే, నాతవరం

దర్పణం



కల్వర్టుకు పడిన రంధ్రం



రోడ్డు మధ్యలో సూచికగా ఆకులు, కొమ్మలు

బాపూజీని స్మరిస్తూ... స్వచ్ఛత పాటిస్తూ!



నర్సీపట్నంలో పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలు అందజేస్తున్న ఆర్డీఓ రమణ, పక్కన ఛైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం అర్బన్, మాకవరపాలెం, న్యూస్‌టుడే: అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం సాధించిపెట్టిన మహాత్ముని జయంతి వాడవాడలా బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ మినీస్టేడియంలో గాంధీ విగ్రహానికి ఆర్డీఓ వి.వి.రమణ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సత్కరించి నూతన వస్త్రాలను అందజేశారు. స్వచ్ఛతపై పౌరుల బాధ్యతలను గుర్తు చేస్తూ ప్లకార్డులతో ర్యాలీ, అబీద్‌కూడలిలో మానవహారం నిర్వహించారు. కమిషనర్ జంపా సురేంద్ర సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. స్వచ్ఛత కార్యక్రమాలను చేపట్టారు. మేజరు పంచాయతీ వేములపూడిలో సర్పంచి నూకాలమ్మ, ఎంపీటీసీ రామప్రసాద్ తదితరులు మొక్కలు నాటారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు పరిశుభ్రతా కార్యక్రమాలను చేపట్టారు. మాకవరపాలెం, తామరం పంచాయతీ సర్పంచి గొంతిన చెల్లారత్నం ఆధ్వర్యంలో సంపద కేంద్రం ఆవరణను శుభ్రం చేశారు. అవంతి ఇంజినీరింగ్ కళాశాల ఎన్.ఎస్.ఎస్. యూనిట్ విద్యార్థులు కళాశాల పరిసరాల్లో తుప్పలు తొలగించారు.

చోడవరం/గ్రామీణం, రోలుగుంట, బుచ్చెయ్యపేట, రావికమతం: చోడవరంలో గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో ఆంజనేయులు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు పాల్గొన్నారు. స్థానిక ప్రేమసమాజంలో అధ్యక్షుడు పూసర్ల రామారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్క్ ప్రసాద్, చిత్రకళానిలయం వ్యవస్థాపకుడు సూర్యనారాయణ జాతిపిత సేవలను స్మరించుకున్నారు. చోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గాంధీ విగ్రహానికి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు నివాళులర్పించారు. రావికమతం, రోలుగుంట, బుచ్చెయ్యపేట మండలాల్లోనూ మహాత్మునికి ఘనంగా నివాళులర్పించారు.

మాడుగుల గ్రామీణం, కె.కోటపాడు, చీడికాడ, దేవరాపల్లి, న్యూస్‌టుడే: అహింసతో స్వరాజ్యాన్ని తెచ్చిన ఘనత గాంధీజీదేనని మాడుగుల ఎంపీపీ తాళపురెడ్డి రాజారాం అన్నారు. మాడుగుల బస్టాండ్ ఆవరణంలో మానవహారంగా ఏర్పడి స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. దేవరాపల్లిలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, సర్పంచి సబ్బవరపు పెంటమ్మ తదితర ప్రజాప్రతినిధులు పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. చీడికాడలో సర్పంచి సామాలమ్మ గాంధీజీ విగ్రహానికి పూలమాల వేశారు. గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలని కె.కోటపాడు ఎంఈఓలు సత్యనారాయణ, ప్రసాదు, అయ్యన్న విద్యాసంస్థల అధినేత ఎస్.కె.ఖాసిం అన్నారు.



మాడుగుల బస్టాండ్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు



చోడవరంలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాజు



కె.కోటపాడులో గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎంఈఓలు, ఖాసిం

చెత్తపన్ను రద్దుతో తగ్గిన భారం



చంద్రయ్యపేటలో సంపద కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి, ఎంపీడీఓ

కె.కోటపాడు, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు చెత్తపై పన్నును రద్దు చేయడంతో ప్రజలకు ఆర్థిక భారం తగ్గిందని సర్పంచి సబ్బవరపు పార్వతి అన్నారు. చంద్రయ్యపేటలో సంపద కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. గ్రామ తెదేపా అధ్యక్షుడు సబ్బవరపు వాసుదేవ్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సాంబశివరావు, మాజీ ఎంపీపీ సబ్బవరపు పుష్పావతి, తెదేపా మండల మాజీ అధ్యక్షుడు సబ్బవరపు రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: సీతయ్యపేట దుర్గామల్లేశ్వర అమ్మవారి ఆలయంలో గురువారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతీరోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. వడ్డాది, బుచ్చెయ్యపేట, దిబ్బిడి, రాజాం, తురకలపూడి, విజయరామరాజుపేట గ్రామాల్లో మండపాలను సిద్ధం చేశారు.

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో పాతబస్టాండ్ వద్ద ఉన్న దుర్గాదేవి ఆలయంలో గురువారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమనున్నాయి. ఆలయం, ముఖద్వారాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. ఈ నెల 12వ తేదీ విజయదశమి వరకు దుర్గాదేవి రోజుకో అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

కె.కోటపాడు, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. చౌడువాడ, గుల్లిపల్లి, ఎ.కోడూరు, పిండ్రంగి గ్రామాల్లో కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాలను ముస్తాబు చేశారు.

చెత్త తరలింపునకు తొలగిన అడ్డంకి



తోపుడుబండ్ల మరమ్మతు పనులు పర్యవేక్షిస్తున్న కమిషనర్ సురేంద్ర

నర్సీపట్నం అర్బన్: మరమ్మతుకు గురై నాలుగు నెలలుగా మూలనపడివున్న చెత్త తరలించే తోపుడుబండ్లు ఎట్టకేలకు బాగుపడ్డాయి. కొద్దిరోజుల క్రితం విధుల్లో చేరిన మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర పారిశుద్ధ్య విభాగంపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఏకంగా 42 తోపుడుబండ్ల వినియోగంలో లేవని గుర్తించి మరమ్మతులకు ప్రతిపాదించారు. కౌన్సిల్ ఆమోదం రావడంతో బుధవారం హుటాహుటిన మరమ్మతు చేయించారు. మరో 20 కొత్త బండ్లు కొనుగోలు చేయాలని నిర్ణయించారు. పట్టణంలో రోజూ 30 మెట్రిక్ టన్నుల వరకు చెత్త సమకూరుతోంది. ప్రస్తుతం 12 బండ్లు మాత్రమే పనిచేస్తున్నాయి. చెత్త తరలింపునకు ఇబ్బందులు ఎదురవుతుండడంతో పాడైనవన్నీ వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకున్నారు.

పేలుళ్లతో బెంబేలు



బోడిమెట్ట క్వారీ

మాకవరపాలెం, న్యూస్‌టుడే: మాకవరపాలెం సమీపంలో గల బోడిమెట్టపై నల్లరాయి తవ్వకాల కోసం చేస్తున్న బాంబ్ పేలుళ్లతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. స్థానిక బీసీ కాలనీ, తామరం ఉపాధ్యాయ కాలనీ, పెట్రోల్‌బంకు సమీపంలో నివాసాలు మంగళవారం మధ్యాహ్నం పేలుళ్లతో అదిరిపోయాయి. పేలుళ్లకు అనుమతులు ఇవ్వడంలేదని అధికారులు చెబుతుంటే, క్వారీలో ఎవరు కొండలను పేలుస్తున్నారో తెలియడంలేదని ప్రజలు వాపోతున్నారు. 15 రోజుల క్రితం వరుసగా భారీస్థాయిలో మందుగుండును ఉపయోగించడంపై అధికారులు చర్యలు చేపట్టాలని, లేదంటే ఆందోళనకు దిగుతామని కాలనీవాసులు చెబుతున్నారు. రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని న్యాయవాది ఇటంశెట్టి సూరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

విత్తన బంతుల అందజేత

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా వాసవీ ఆయుష్మాన్ క్లబ్ సభ్యులు బుధవారం ఇరవై వేల విత్తన బంతులను సబ్ డీఎఫ్ఓ సునీల్‌కుమార్‌కు అందజేశారు. క్లబ్ జిల్లా ఉప కార్యదర్శి వెలగా నారాయణరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మూడు కోట్ల విత్తన బంతులను వాసవీక్లబ్ సభ్యులు తయారు చేశారని తెలిపారు. నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లోనే 1.50 లక్షల విత్తన బంతులను 26 క్లబ్బుల్లోని సభ్యులు తయారు చేశారని వివరించారు. కార్యక్రమంలో ఆయుష్మాన్ క్లబ్ అధ్యక్షుడు శీరం లక్ష్మణ్, జోనల్ ఛైర్మన్ కుసుమంచి వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సబ్ డీఎఫ్ఓ సునీల్ కుమార్‌కు విత్తన బంతుల సంచులు అందజేస్తున్న వాసవీ సభ్యులు

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు వరహాపురం విద్యార్థులు

చీడికాడ, న్యూస్‌టుడే: వరహాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రగ్బీ క్రీడలో సత్తా చాటారు. ఈనెల ఒకటిన దిబ్బిడిలో జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి పోటీలో అండర్-14, 17 విభాగాల్లో వీరు ప్రతిభ చూపారు. దీంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారని పీడీ సింహాచలం 'న్యూస్‌టుడే'తో చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలకు అండర్-17 విభాగం నుంచి డి.లోవర్ధన్, ఎస్.నీలవర్ధన్, ఎస్.కృష్ణవేణి, జి.వసంత, అండర్-14 విభాగం నుంచి డి.వసంత, ఎస్.లిఖిత ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరిని హెచ్ఎం వరహామూర్తి, సర్పంచి చిన్నమ్మలు, ఎంపీటీసీ సభ్యురాలు స్వాతి అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులతో పీడీ సింహాచలం

నర్సీపట్నం కమిషనర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ఫ్లెక్సీలో తన ఫొటో లేకుండా అవమానించిన మున్సిపల్ కమిషనర్ సురేంద్రపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు ఛైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి తెలిపారు. బుధవారం వీడియో ప్రకటనలో ఆమె మాట్లాడుతూ గాంధీ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటైన కార్యక్రమానికి తనను ఆహ్వానించారని, ఈ కార్యక్రమంలో ప్రదర్శించిన స్వచ్ఛతే సేవ ఫ్లెక్సీలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఫొటో తప్ప తన ఫొటో లేదన్నారు. గతంలోనూ ఇలానే చేశారని ఆరోపించారు. ఆర్డీఓ రమణకు ఆ ఫ్లెక్సీని చూపించానని తెలిపారు. దీనిపై కలెక్టర్ చర్య తీసుకుంటారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743
చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74737

నర్సీపట్నం, న్యూస్‌టుడే

సమస్య: స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం సమీపంలోని అపార్ట్‌మెంటు, స్కూల్ ఉన్న ప్రాంతంలోని కాలువలో పేరుకుపోయిన పూడిక చాలా రోజులుగా తొలగించలేదు.
– ఎన్.రాజారావు, నర్సీపట్నం

సమాధానం: సిబ్బందిని పంపించి అక్కడ అంతా శుభ్రం చేయిస్తాం. – అప్పలరాజు, శానిటరీ మేస్త్రి, నర్సీపట్నం

పరిసరాలు బాగుంటేనే ఆహ్లాదం

గొలుగొండ, న్యూస్‌టుడే: నివాస ప్రాంతాలు, ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద నిత్యం పారిశుద్ధ్య పనులు చేపట్టడం వలన పరిసరాలు ఆహ్లాదకరంగా ఉంటాయని ఎంపీపీ మణికుమారి అన్నారు. బుధవారం స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్తు, తహసీల్దార్, వెలుగు, ఉపాధి హామీ కార్యాలయాల సముదాయం చుట్టూ చెత్తను తొలగించి మంటపెట్టారు. తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోలుగుంట, న్యూస్‌టుడే: స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలుచోట్ల పరిశుభ్రత- పచ్చదనం కార్యక్రమాన్ని చేపట్టారు. కొవ్వూరులో వెంకటేశ్వర యువజన సంఘం ఆధ్వర్యంలో శ్రమదానం చేపట్టి వీధులను శుభ్రం చేశారు. సర్పంచి కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సిబ్బంది శ్రమదానంతో శుభ్రత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మొక్కలు నాటారు.



గొలుగొండ కార్యాలయ ఆవరణలో అధికారుల శ్రమదానం

జీతాలు సకాలంలో చెల్లించక ఇబ్బందులు

చోడవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న ఒప్పంద కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ 32 రోజులుగా నిరసన తెలుపుతున్నా అధికార యంత్రాంగం స్పందించడం లేదని ఆ సంఘ కార్యదర్శి కోన లక్ష్మణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆసుపత్రుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీగార్డులు తదితరులకు జీతాలు సకాలంలో చెల్లించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గుత్తేదారు వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల అయిదో తేదీలోగా సమస్యలు పరిష్కరించకపోతే ఆరో తేదీ నుంచి విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. ముచ్చు కోటేశ్వరరావు, నూకరత్నం సుశీల, మంగ, లక్ష్మి కుమారి తదితరులు పాల్గొన్నారు.



చోడవరం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఒప్పంద కార్మికుల నిరసన

ప్రభుత్వ పరిశ్రమలను పరిరక్షించాలి

గొలుగొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేసే ప్రక్రియపై కేంద్రం దృష్టి సారించడం ఆందోళన కలిగిస్తోందని, వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఉందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.రామునాయుడు పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్తు కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నల్ల రిబ్బన్లు తగిలించుకుని నిరసన తెలిపారు. వరద బాధితులను ఆదుకోవడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. పార్టీ మండల కార్యదర్శి మేకా భాస్కరరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి వినతి పత్రమిస్తున్న ఉద్యోగులు

గోడు పట్టించుకోరూ..

నర్సీపట్నం అర్బన్: సమ్మెకాలం నాటి హామీలను అమలు చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని ఉద్యోగులంతా బుధవారం నర్సీపట్నంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం చూపి నినాదాలు చేశారు. జిల్లా గౌరవాధ్యక్షుడు పూడి వెంకటరావు మాట్లాడుతూ ఆగస్టు, సెప్టెంబరు వేతనాలను విడుదల చేయాలని కోరారు. నాయకులు పట్నాల సతీష్, వరహాలబాబు పాల్గొన్నారు. కల్లుగీత కార్మికులకు కొత్త జిల్లాల పేరుతో గుర్తింపు కార్డులు ఇవ్వాలని గీత కార్మిక సంఘం నాయకులు తాతబ్బాయి గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు.

పశువుల పాక దగ్ధం

చోడవరం గ్రామీణం: వెంకన్నపాలెం గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో పశువుల పాక దగ్ధమైంది. మొల్లి సాయికి చెందిన పాకపై గుర్తుతెలియని వ్యక్తి సిగరెట్ పారేయడంతో పాకంతా కాలిబూడిదైంది. సుమారు రూ. 80 వేలు ఆస్తినష్టం జరిగింది. చోడవరం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. సర్పంచి ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు రమణ, జనసేన నాయకుడు సియాద్రి జగదీష్ తదితరులు బాధిత రైతును పరామర్శించారు.

22 మద్యం దుకాణాలకు దరఖాస్తులు

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: నూతన మద్యం విధానంలో భాగంగా చోడవరం, బుచ్చెయ్యపేట, కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో మొత్తం 22 మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు ఎక్సైజ్ సీఐ కె.పప్పునాయుడు బుధవారం తెలిపారు. చోడవరంలో 8, బుచ్చెయ్యపేటలో 4, దేవరాపల్లిలో 4, కె.కోటపాడులో 5 మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయని చెప్పారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఈనెల 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, 11వ తేదీన అనకాపల్లిలో లాటరీ తీయనున్నట్లు చెప్పారు.

పెందుర్తి

ఎంపీ రమేశ్‌కు ఘన స్వాగతం

పెందుర్తి, న్యూస్‌టుడే: రైల్వే శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకొని తొలిసారి విశాఖ విచ్చేసిన అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌కు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు నేతృత్వంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. బుధవారం విశాఖ విమానాశ్రయంలో ఆయనను కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ తెదేపా ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు, 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

19 మద్యం దుకాణాల ఏర్పాటుకు అవకాశం


మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ అనిల్‌కుమార్

సబ్బవరం న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఎక్సైజ్ పాలసీ ఆధారంగా అనకాపల్లి జిల్లా కలెక్టర్ ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా సబ్బవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సబ్బవరం, పరవాడ మండలాలు ఉంటాయని ఎక్సైజ్ సీఐ డి.అనిల్‌కుమార్ తెలిపారు. ఈ రెండు మండలాల్లో 19 మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. సబ్బవరం మండలానికి 8, పరవాడ మండలానికి 11 దుకాణాలు కేటాయించారన్నారు. ప్రస్తుత నోటిఫికేషన్ ప్రకారం దుకాణాలు ఏర్పాటు చేసుకోదలచిన వారు దరఖాస్తు రుసుము రూ.2 లక్షల డిమాండ్ డ్రాఫ్ట్ డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఆఫీసర్ అనకాపల్లి పేరున డీడీ తీయవలసి ఉంటుందన్నారు. దరఖాస్తుతోపాటు ఆధార్ లేదా ఏదైనా గుర్తింపు కార్డు జత చేయాలన్నారు. ఈనెల 11న కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ తీసి దుకాణాలు కేటాయిస్తారన్నారు. ఒక్కో దుకాణానికి రూ.65 లక్షలుగా నిర్ణయించడం జరిగిందని ఇందులో 6వ వంతు మొత్తాన్ని మొదటి వాయిదాలో చెల్లించి రెండేళ్ల పాటు నిర్వహించుకోవచ్చునన్నారు. దరఖాస్తులకు చివరి తేదీ ఈనెల 10గా నిర్ణయించినట్లు తెలిపారు.

అనధికార పార్కింగ్‌తో అవస్థలు


పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ నుంచి లంకెలపాలెం వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారిలోని రాంకీ ఎస్‌ఈజెడ్ కూడలికి సమీపంలో అనధికార పార్కింగ్ కొనసాగుతోంది. ఫార్మాసిటీకి సామగ్రిని తీసుకొచ్చిన భారీ వాహనాలను రహదారిని ఆనుకుని నిలిపివేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ దారిలో ఎదురుగా వచ్చే వాహనాల నుంచి తప్పించుకోవడానికి మార్గం సరిపోక ఇక్కట్లు పడుతున్నారు. కొందరు మొరాయించిన వాహనాలను రోడ్డుపైన రోజుల తరబడి ఇష్టానుసారంగా వదిలేస్తున్నారు. రాత్రి సమయంలో చీకటి కారణంగా దగ్గరికి వచ్చేవరకు ఆగి ఉన్న వాహనాలు కనబడకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి అనధికార పార్కింగ్ చేసే వాహనదారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


రహదారి పక్కన నిలిపిన వాహనాలు

చెత్త పన్నుకు చెల్లు

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటనపై ప్రజల హర్షం

వేపగుంట(నాయుడుతోట), న్యూస్‌టుడే



పేదలకు ఏ విధమైన పన్నులు విధించినా అది భారంగానే ఉంటుంది. గత వైకాపా ప్రభుత్వం సామాన్యుడి నెత్తిపై ఎన్ని రకాల ధరలు, పన్నుల భారాలను మోపాలో అన్నింటిని మోపింది. అందులో చెత్త పన్ను ఒకటి. దీనిపై పేదలు, మధ్య తరగతి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ గత వైకాపా ప్రభుత్వం వెనకడుగు వేయలేదు. తాము అధికారంలోకి రాగానే చెత్త పన్ను లేకుండా చేస్తామని చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారమే గాంధీ జయంతి సందర్భంగా బుధవారం మచిలీపట్నంలో నిర్వహించిన బహిరంగ సభలో చెత్త పన్నును పూర్తిగా తొలగిస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దీంతో పేద, సామాన్య ప్రజానీకం, మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంక్షేమ పథకాలకు ముడిపెట్టి మరీ వసూలు..

ఇంటింటి చెత్త సేకరణ కోసం గత వైకాపా ప్రభుత్వం క్లాప్ వాహనాలను ఏర్పాటు చేసింది. ఆ వాహనాల నిర్వహణకు అయ్యే ఖర్చును స్థానిక సంస్థలే భరించుకునేలా నిర్ణయం తీసుకోవడంతో ఆ భారం ఆయా స్థానిక సంస్థలకు తలకు మించిన భారంగా మారింది. దీంతో ఈ భారాన్ని ప్రజలపై వేశారని అప్పట్లో పలువురు విమర్శించారు. సచివాలయ కార్యదర్శులపై ఒత్తిడి పెంచడంతో చెత్త పన్నును వారు ప్రజల ముక్కు పిండి వసూలు చేసేవారు. ఎవరైనా చెల్లించకపోతే సంక్షేమ పథకాలు నిలిపేస్తారని భయపెట్టడంతో చేసేది లేక ఎన్ని ఇబ్బందులైనా భరించి పన్ను చెల్లించేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి చెత్త పన్నును వసూలు చేయనప్పటికీ అధికారికంగా మాత్రం రద్దు చేయలేదు. ముఖ్యమంత్రి ప్రకటనతో పన్ను వసూలు అధికారికంగా రద్దు కానుంది.

జీవీఎంసీ జోన్-8 పరిధిలో..	
మొత్తం ఇళ్లు :	74 వేలు(సుమారు)
నెలకు చెల్లించాల్సిన చెత్త పన్ను :	రూ. 120
మురికివాడల్లో :	రూ. 60
ఏటా వసూలైన నగదు :	రూ. 11 కోట్లు పైగా..

ఎంత తగ్గినా మేలే..



మా ఆయన సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నారు. నేను టైలరింగ్ చేస్తున్నా. ఇద్దరం కష్టపడినప్పటికీ ఇంటిని నడపడం కష్టంగానే ఉంటోంది. మాలాంటి పేదల కష్టాలు తెలుసుకోకుండా గత వైకాపా ప్రభుత్వం పలు రకాల పన్నులు వేసి మరింత కుంగుబాటుకు గురిచేసింది. ఏడాదికి రూ.1420 చెల్లించే వాళ్లం. చెత్త పన్ను రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన మాలో ఎంతో సంతోషాన్నిచ్చింది. పేదలకు పన్నుల భారం తగ్గితే ఎంతో మేలు.
– టి.భగవద్గీత, బంటకాలనీ

మాలాంటి కూలీలకు ఆసరా..



మా ఆయన, నేను ఇద్దరం కూలికి వెళ్తాం. కొన్ని రోజులు పనులు దొరకవు. దీంతో ఇల్లు గడవడం కష్టంగా ఉంటుంది. ఇలాంటి సమయాల్లో నెలకు రూ.120 చొప్పున ప్రతినెలా చెల్లించడమంటే మాలాంటి నక్కపై తాటిపండు పడ్డట్లే. ఓ పక్క ఇంటి పన్ను పెంచి మరోపక్క చెత్త పన్ను వసూలు చేయడంతో చాలా భారంగా ఉండేది. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు చెత్త పన్ను రద్దు చేయడం మాలాంటి కుటుంబాలకు ఎంతో భారం తగ్గించినట్టు అవుతుంది.
– టి.సతోషకుమారి, అప్పన్నపాలెం

చెత్తను తొలగించి.. మొక్కలు నాటి..


సబ్బవరం పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు నాటుతున్న సీఐ రమణ, డీఎస్ఎన్ఎల్‌యూ విద్యార్థులు

సబ్బవరం, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ) విద్యార్థులు సబ్బవరం పోలీస్‌స్టేషన్, బస్టాండుల్లో చెత్తను తొలగించి మొక్కలు నాటారు. సీఐ పిన్నింటి రమణ ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు, గాంధీజీ ఆశయ సాధనకు కృషి చేస్తున్న విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డీఎస్ఎన్ఎల్‌యూ ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాష్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఎన్ఏడీ పాల్, ముఖ్య వార్డెన్ భాగ్యలక్ష్మి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


ఎంపీ రమేశ్‌కు సమస్యలు వివరిస్తున్న పాల అచ్చిలనాయుడు

పాలవలస(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డులోని సమస్యలను పరిష్కరించాలని వార్డు తెదేపా అధ్యక్షుడు పాల అచ్చిలనాయుడు కోరారు. ఈ మేరకు అనకాపల్లిలో ఎంపీ సీఎం రమేశ్‌ను బుధవారం వార్డు తెదేపా నాయకులతో కలిసి సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. ప్రముఖ పుణ్యక్షేత్రం అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు, వార్డులోని చెరువులను అభివృద్ధి, రోడ్లు, కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. సింహాద్రి ఎన్టీపీసీ, హిందుజా విద్యుత్తు కేంద్రాల్లో భూ నిర్వాసితులకు ఉపాధి అవకాశాలను కల్పించాలని, కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. తెదేపా నాయకులు పాల నగేశ్, కాకి నారాయణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

మాంసం దుకాణాల యజమానులకు జరిమానా

వేపగుంట, న్యూస్‌టుడే: గాంధీ జయంతి సందర్భంగా బుధవారం మాంసం దుకాణాలు తెరవొద్దని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ కొంతమంది తమ వ్యాపారాలు కొనసాగించారు. జోన్-8 ప్రజారోగ్య విభాగం అధికారి అప్పలనాయుడు సారధ్యంలో సిబ్బంది దాడులు చేసి పలువురికి జరిమానా విధించి దుకాణాలను మూయించారు. పెందుర్తిలోని రెండు దుకాణాలకు రూ.3 వేలు చొప్పున, 94, 95వ వార్డుల్లో ఒక్కో దుకాణానికి రూ.వెయ్యి చొప్పున, 92వ వార్డులో ఆరు దుకాణాలకు రూ.300 చొప్పున జరిమానా విధించారు. భవిష్యత్తులో ప్రభుత్వం ప్రకటించిన శెలవు దినాల్లో మాంసం దుకాణాలు తెరచినట్లయితే భారీ ఎత్తున జరిమానా విధించడంతోపాటు సీజ్ చేయడం జరుగుతుందని ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు హెచ్చరించారు.

బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో తర్పణాలు


తర్పణ కార్యక్రమాల్లో పాల్గొన్న బ్రాహ్మణులు

వి.జుత్తాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: మహాలయ అమావాస్యను పురస్కరించుకుని పెందుర్తి మండలం వి.జుత్తాడలోని బ్రాహ్మణ భవనంలో బుధవారం పితృదేవతలకు తిల తర్పణం, పిండ ప్రదానాలు సంప్రదాయబద్ధంగా జరిపారు. బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నగరంతో పాటు పలు ప్రాంతాలకు చెందిన బ్రాహ్మణులు పాల్గొన్నారు. పండితులు బ్రహ్మశ్రీ చొప్పలి సాయి శర్మ పర్యవేక్షణలో పితృదేవతలకు పూజలు చేసి తర్పణాలు సమర్పించారు.

నూతన నియామకం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : ఇండియన్ బాడీ బిల్డర్స్ ఫెడరేషన్ నూతన అధ్యక్షుడిగా సీనియర్ కోచ్ స్వామి రమేష్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం పెదగంట్యాడ సత్యహెల్త్ కేర్ జిమ్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. బాడీ బిల్డింగ్ పోటీల్లో గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయికి ఎదగడానికి రమేష్‌కుమార్ చేసిన కృషి మరువలేనిదన్నారు. జాతీయ క్రీడాకారుడు డాక్టర్ ఎస్.రాజారావు, కోచ్‌లు సతీష్, రమణ, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి

పరవాడ, న్యూస్‌టుడే: హిందూ ధర్మ పరిరక్షణకు పాటు పడాలని సమరసత సేవా ఫౌండేషన్ పరవాడ మండల కన్వీనర్ ఎం.నాగపేర్రాజు పిలుపునిచ్చారు. పరవాడ సినిమాహాల్ కూడలిలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దేవాలయాల్లో సామూహిక హారతి, సంకీర్తన, భజనలు చేయాలన్నారు. గొర్లె ఎరుకునాయుడు, పైలా శ్రీను, ఎల్.అప్పలనాయుడు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్.వి.అంబేడ్కర్ బుధవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును సుజాతనగర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్లకు తహసీల్దార్ మొక్కను అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ సురేశ్‌నాయుడు పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత

పెందుర్తి, న్యూస్‌టుడే: సనాతన ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పేర్కొన్నారు. జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా చేపట్టిన నగర సంకీర్తనను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. సుజాతనగర్ 80 అడుగుల రహదారిలోని జనసేన పార్టీ కార్యాలయం నుంచి చినముషిడివాడలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం వరకు నగర సంకీర్తన కొనసాగించారు. మహిళలు కోలాటం చేస్తూ కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చినముషిడివాడలో నిర్వహించిన నగర సంకీర్తనలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, నాయకులు

ఉత్తమ స్వచ్ఛ పంచాయతీగా పెదగాడి

పెదగాడి(పెందుర్తి), న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా పెందుర్తి మండలం పెదగాడి పంచాయతీని ఉత్తమ స్వచ్ఛ పంచాయతీగా ఎంపిక చేసినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్మూర్తి తెలిపారు. కాపులుప్పాడ దరి జీవీఎంసీ డంపింగ్ యార్డు ఆవరణలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, పెందుర్తి ఈవోపీఆర్డీ దీపిక, స్వచ్ఛ కార్మికులు దేవుడు, శేషు, అప్పారావు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మేయర్ హరి వెంకటకుమారి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్మూర్తి, సిబ్బంది

ఉపాధి పనులతో గణనీయ అభివృద్ధి

రాంపురం(పెందుర్తి), న్యూస్‌టుడే: ఉపాధి హామీ పనులతో గ్రామాల్లో గణనీయమైన అభివృద్ధి సాకారం కానుందని విశాఖ జిల్లా డ్వామా పీడీ పూర్ణిమాదేవి అన్నారు. ఉపాధి పనుల ప్రణాళికలో భాగంగా బుధవారం పెందుర్తి మండలంలోని అన్ని పంచాయతీల్లో ప్రాథమిక గ్రామసభలు నిర్వహించారు. రాంపురంలో నిర్వహించిన సభలో పూర్ణిమాదేవి పాల్గొని మాట్లాడారు. పెందుర్తి మండలంలోని 15 పంచాయతీల్లో 2025-26 సంవత్సరానికి గాను 2,37,418 పనిదినాలు మంజూరయ్యాయన్నారు. వేతనాలు, సామగ్రి కలిపి రూ.11,87,10,000 బడ్జెట్ ఆమోదానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సర్పంచి అన్నంరెడ్డి శిరీష, ఎంపీటీసీ సభ్యురాలు గండి హిమబిందు, జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, పంచాయతీ కార్యదర్శి పైడిరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.


గ్రామసభలో మాట్లాడుతున్న డ్వామా పీడీ పూర్ణిమాదేవి

మార్షల్ ఆర్ట్స్ హబ్‌గా విశాఖ

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: మార్షల్ ఆర్ట్స్ హబ్‌గా విశాఖ తయారైందని సినీ నటుడు, అఖిల భారత మార్షల్ ఆర్ట్స్ ఛైర్మన్ సుమన్ తెలిపారు. రెండో వైజాగ్ ఓపెన్ జాతీయస్థాయి కరాటే పోటీల గోడపత్రికలను బుధవారం పోర్టు స్టేడియంలోని విశ్వనాథ స్పోర్ట్స్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సీనియర్ కరాటే మాస్టర్ మేకల విజయసారథి జ్ఞాపకార్థం జాతీయస్థాయి పోటీలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ఈ పోటీలు డిసెంబరు 15 నుంచి విశ్వనాథ స్పోర్ట్స్‌క్లబ్‌లో జరుగుతాయన్నారు. అంతకు ముందు లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. టోర్నీ ఛైర్మన్ బొడ్డేటి కాశీవిశ్వనాథ్, భాజపా నాయకులు బొత్స సురేష్, జనసేన డాక్టర్ల సెల్ ఛైర్మన్ బొడ్డేపల్లి రఘు, టోర్నీ చీఫ్ ఆర్గనైజరు చిగురుపల్లి సతీష్‌కుమార్, ప్రతినిధులు అంగరాము, ఆనందబాలు, బాలకృష్ణ, అంబు, శివగణేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

వేపగుంట, న్యూస్‌టుడే: నీటి గుంటలు, చెరువుల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జీవీఎంసీ 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు తెలిపారు. వేపగుంట శ్మశానవాటిక సమీపంలో ఉన్న మురుగు నీటి గుంటల్లో దోమల నివారణ మందు చల్లేందుకు ప్రజారోగ్య విభాగం అధికారులు వినియోగిస్తున్న డ్రోన్ పిచికారీ యంత్రాన్ని బుధవారం బల్ల శ్రీనివాసరావు ప్రారంభించారు. దోమల నివారణకు ప్రజలు తమవంతుగా పరిశుభ్రతను పాటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు, సూపర్‌వైజర్ సత్యానంద్, మలేరియా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.


డ్రోన్ పిచికారీ యంత్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు

ఆలయాలకు శరన్నవరాత్రుల శోభ

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: దసరా వేడుకల్లో భాగంగా నియోజకవర్గంలోని పలు దేవాలయాలు, సంఘాల ఆధ్వర్యంలో గురువారం నుంచి శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఆ మేరకు ఆలయ కమిటీలు, నిర్వాహకులు సన్నాహాలు పూర్తి చేశారు. జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లో కొలువైన పంచముఖ గాయత్రీ, వేంకటాద్రి ఘాట్‌రోడ్డులోని ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రంలో, చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలమేలు మంగాదేవి, సిద్ధార్థనగర్‌లోని లలితా పరమేశ్వరి, సుజాతనగర్, పెందుర్తి ప్రశాంతినగర్, ఎస్ఆర్ పురంలోని కనకదుర్గమ్మ, రాంపురంలోని మహాకామేశ్వరి పీఠంలో దేవీ నవరాత్రులు జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


శ్రమశక్తినగర్‌లో కొలువైన పంచముఖ గాయత్రీ అమ్మవారు


దేవీపురం రాజరాజేశ్వరి

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట ముత్యమాంబ అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈసారి వేడుకల్లో బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. 9 రోజుల పాటు ఈ బొమ్మల కొలువు ఉంటుందని ఆలయ అర్చకులు శేషాద్రిశర్మ తెలిపారు. గవరజగ్గయ్యపాలెం, వేపగుంట, ప్రహ్లాదపురం, పురుషోత్తపురం, నరవ ప్రాంతాల్లో నవరాత్రి వేడుకలు జరపనున్నారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలోని దేవీపురంలో దసరా బ్రహ్మోత్సవాలను శోభాయమానంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కె.ప్రభాకర్ తెలిపారు. మహాలక్ష్మి, మహాసరస్వతి దేవీ సమష్టి రూపమైన శ్రీచండికా పరదేవతను కొలుచుకునే భాగ్యం భక్తులకు కలుగుతుందన్నారు.

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ, తానాం, దేశపాత్రునిపాలెం, వెన్నెలపాలెం, ధర్మారాయుడుపేట, తాడి, వాడచీపురుపల్లి, లంకెలపాలెం తదితర గ్రామాల్లో గురువారం దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠంచడానికి ఉత్సవ కమిటీ ప్రతినిధులు భారీ ఏర్పాట్లు చేశారు. వేదికల వద్ద ప్రత్యేక విద్యుత్తు దీపాలంకరణ చేశారు.


పరవాడలో రూపుదిద్దుకున్న ఉత్సవ మండపం


ముత్యమాంబ అమ్మవారి ఆలయంలో బొమ్మల కొలువు

స్ఫూర్తిదాయకం.. మహాత్ముడి మార్గం

సత్యం, అహింస ఆయుధాలుగా స్వాతంత్ర్య సాధనకు కృషి చేసిన మహనీయుడు జాతిపిత గాంధీజీ జీవితం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం పెందుర్తి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని మహాత్ముడి విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. పలుచోట్ల దంత, వైద్య శిబిరాలు నిర్వహించారు. పేదలు, అనాథాశ్రమాలకు నిత్యావసరాలు అందజేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.
– న్యూస్‌టుడే, పెందుర్తి, వేపగుంట, పరవాడ, సబ్బవరం


పెందుర్తి ఎంపీడీవో కార్యాలయం వద్ద మహాత్ముడి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల, తదితరులు


సింహాద్రి ఎన్టీపీసీలో నివాళి అర్పిస్తున్న ఎన్టీపీసీ అధికారులు


పరవాడ పోలీస్‌స్టేషన్‌లో అంజలి ఘటిస్తున్న సీఐ మల్లికార్జునరావు


శిర్డీ సాయినగర్‌లో దంత వైద్య శిబిరం


పెందుర్తి గ్రంథాలయం వద్ద గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న జీవీఎంసీ తెదేపా ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు, పాఠకులు


నాయుడుతోటలో విశ్వకర్మ ఐక్యవేదిక సభ్యులు..


లంకెలపాలెంలో 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు


నంగి నారపాడు ఉన్నత పాఠశాలలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న జనసేన నేత ఇందల వెంకటరమణ


శ్రీనివాసనగర్‌లోని మనసు అనాథ పిల్లల ఆశ్రమానికి నిత్యావసరాలు అందిస్తున్న ఎస్‌వీఎల్ఎన్ వాకర్స్ క్లబ్ సభ్యులు


సబ్బవరం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో..


మొగలిపురంలో..


వేపగుంట ఓపెన్ జిమ్ వాకర్స్ క్లబ్ సమక్షంలో..


కృష్ణానగర్‌లో ఐహెచ్ఆర్‌సీ సంస్థ ఆధ్వర్యంలో..